



# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 • సంచిక : 22 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi మంగళవారం 3 ఫిబ్రవరి 2026 • పేజీలు : 8 • వెల 2/-


## బంగ్లా చెరనుంచి బయటపడ్డ మత్స్యకారులు



**విశాఖపట్టణం,ఫిబ్రవరి2 (చట్టం న్యూస్):** సముద్రంలో వేటకు వెళ్లి బంగ్లాదేశ్ తీర ప్రాంతంలో పొరపాటున ప్రవేశించి గత ఏడాది అక్టోబర్‌లో అరెస్ట్ కాబడి, దాదాపు నాలుగు మాసాల పాటు బంగ్లాదేశ్ జైలులో ఉన్న 9 మంది మత్స్యకారులు విడుదలయ్యారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో స్థానిక ఫిషింగ్ హార్బర్ కు వీరంతా

మిగతా 2వ పేజీలో..

## వికసిత భారత్ లక్ష్యానికి అనగుణంగా బ్జడెట్

- పోలవరం ప్రాజెక్టుకు రూ.3 వేల కోట్లకు పైగా నిధులు
- గ్రామిణ ప్రాంతాల్లో రోడ్ల కోసం రూ.500 కోట్లు
- బడ్జెట్‌పై ఎంపి పురందేశ్వరి వ్యాఖ్య



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి2 (చట్టం న్యూస్):** వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకునేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్ ఉందని బిజెపి ఎంపి పురందేశ్వరి అన్నారు. కర్తవ్య స్ఫూర్తిని కొనసాగించేలా బడ్జెట్ ఉందని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీ వేదికగా మీడియాతో పురందేశ్వరి మాట్లాడారు. వరుసగా తొమ్మిది సార్లు బ్జడెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధి కోసం 350 సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దేశాన్ని నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపిన ఘనత ప్రధానమంత్రి

మిగతా 2వ పేజీలో..

# తిరుమల లడ్డూపై ఎందుకు మాట్లాడరు

- వైకాపా ట్రాప్‌లో పడకండి
- పార్టీ శ్రేణులకు జనసేనాని హితవు





**మంగళగిరి,ఫిబ్రవరి 2 (చట్టం న్యూస్) :** జనసేన పార్టీ జనరల్ బాడీ సమావేశం వేదికగా పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పార్టీ నేతలపై అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తిరుమల లడ్డూ వ్యవహారం గురించి వైసీపీ చేస్తున్న విమర్శల ధాటిని తిప్పికొట్టడంలో నేతలు విఫలమవుతున్నారని ఆయన అన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కీలక సమావేశంలో పవన్ కళ్యాణ్.. పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, పీఏసీ సభ్యుల తీరుపై ఘాటుగా స్పందించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఇంత జరుగుతున్నా ఒక్కరూ ఎందుకు మాట్లాడటం లేదన్నారు. అన్నింటికీ నేనే సమాధానం చెప్పాలా అన్నారు. అలాంటప్పుడు మీరు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఎందుకు ఉన్నట్టు అని పవన్ ప్రశ్నించారు.

వైసీపీ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతారని, అప్రమత్తంగా ఉండి వారి కుతంత్రాలను తిప్పికొట్టాలని సూచించారు. నేతల వ్యక్తిగత వ్యవహారాల వల్ల పార్టీకి నష్టం కలగకూడదని, సిద్ధాంత పరంగా, స్జబెక్ట్ పరంగా మాత్రమే మాట్లాడాలని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ భవిష్యత్ కార్యాచరణను వివరించారు. తిరుమల లడ్డూ అపవిత్రత, కేంద్ర బ్జడెట్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తీర్మానాలు చేశామని వెల్లడించారు. జగన్ హయాంలో శ్రీవారి సొమ్ము రూ. 233 కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. మార్చి 14 నపార్టీ ఆవిర్భావ దినోత్సవం లోపు పార్టీ

మిగతా 2వ పేజీలో..

## రాష్ట్రపతి పాలన విధించాలనడం రాజకీయ కుట్రే

ప్రతీకారం, గూండాయిజంతో రేరపూరిత కుట్రలు

టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు యనమల తీవ్ర విమర్శలు




**అమరావతి,ఫిబ్రవరి2 (చట్టం న్యూస్):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్.. రాజకీయ ఆయుధాలుగా ప్రతీకారం, గూండాయిజం, నేరపూరిత కుట్రలనే ఉపయోగిస్తున్నారని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు తీవ్ర విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు విఫలమయ్యాయని చెబుతున్న జగన్, ఆయన అనుచరులు.. రాష్ట్రంలో ఆర్టికల్ 356 ప్రకారం రాష్ట్రపతి పాలన విధించాలని మాట్లాడటం పూర్తిగా రాజకీయ కుట్రేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అశాంతి, నేర కార్యకలాపాలకు జగన్, ఆయన అనుచరులే ప్రధాన సృష్టికర్తలని యనమల ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రతీకార రాజకీయాలతో

మిగతా 2వ పేజీలో..

# రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు

- అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు
- ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదు
- లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపా అడ్డంగా దొరికిపోయింది
- అందుకే ఫ్రస్టేషన్‌లో నానా యాగీ చేసే ప్రయత్నాలు
- వైకాపా కుట్రలతో టిడిపి నేతలు జాగ్రత్తగా ఉండాల్సిందే
- పార్టీ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్





**అమరావతి,ఫిబ్రవరి2 (చట్టం న్యూస్):** రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు పన్నుతోందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. అధికారం కోల్పోయామనే అసహనంతోనే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని.. అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో సీఎం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై వైకాపా పుట్టింది. ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదని చంద్రబాబు అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపా అడ్డంగా దొరికిపోయింది. రాష్ట్ర ప్రజలంతా ఆ పార్టీని చీదరించుకుంటున్నారు. చేసిన పాపాలను దారిమళ్లించాలనేది వైకాపా కుట్ర. పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా. అది వైకాపా నేతలకు నచ్చడం లేదు. అందుకే అడ్డుకునేందుకు కుట్రలకు పాల్పడుతున్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతాం. తెదేపా కార్యకర్తలు సంయమనం పాటించేలా మంత్రులు, నేతలు బాధ్యత తీసుకోవాలి. కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వైకాపా ట్రాప్‌లో పడొద్దు. అలా జరగకుండా పార్టీ నేతలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇకపోతే రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాలు, శాంతిభద్రతల అంశం, పాలనలో మార్పులు వంటి విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తాజా ట్వీట్ చర్చకు దారితీసింది. వైసీపీపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర పునర్నిర్మాణాన్ని జీర్ణించుకోలేక వైసీపీలో ఫ్రస్టేషన్ పెరిగిందని చంద్రబాబు విమర్శించారు. ÷ూజకీయాలను నేరమయం చేయడమే వైసీపీ సిద్ధాంతమని, వారి పాలనలో చట్టవిరుద్ధ పాలనకు అనేక ఉదాహరణలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. జగన్ హయాంలో చట్టాన్ని పక్కనపెట్టి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన అనేక అక్రమాలు, చట్టవిరుద్ధ చర్యలే దీనికి నిదర్శనమని ప్రస్తావించారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ జగన్ పాలన కొనసాగిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు తన ట్వీట్‌లో రూల్ ఆఫ్ లా గురించి ప్రధానంగా ప్రస్తావించారు. 2024 తర్వాతే రాష్ట్రంలో నిజమైన చట్టపాలన అమలవుతోందని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో చట్టం పేరుకే ఉండేదని అధికారమే అన్నింటికీ ఆధారంగా మారిందని విమర్శించారు. ప్రజలకు న్యాయం అందాలంటే రాజ్యాంగమే సుప్రీమ్‌గా ఉండాలని, అదే తమ ప్రభుత్వ విధానమని చంద్రబాబు స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే అధికారం ఎవరికీ లేదని, అది ఏ పార్టీకి చెందిన వారైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని చంద్రబాబు అభివర్ణించారు. గతంలో క్షీణించిన శాంతిభద్రతల పరిస్థితిని పునరుద్ధరించామన్నారు. ప్రజల భద్రత, ప్రశాంత వాతావరణం

మిగతా 2వ పేజీలో..

## బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హదరాబాద్

- భారత్ సరిహద్దుల్లోకి చైనా చొరబాట్లు
- ఆర్మీ మాజీ చీఫ్ నరవణెళి పుస్తకంలో వెల్లడి
- సభలో మాట్అలాడకుండా అడ్డుకున్నారు: రాహుల్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2 (చట్టం న్యూస్):** భారత సరిహద్దుల్లోకి చైనా సైన్యం చొరబడుతోందనే మాటలు తాను చెప్పినవి కావని, స్వయంగా ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణెళి తన పుస్తకంలో రాసినవేనని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ తెలిపారు. వాస్తవాలు బయటకు రాకూడనే ఉద్దేశంతోనే ఆ పుస్తక ప్రచురణను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. జాతీయ భద్రతకు సంబంధించిన విషయాలు చెబుతాననే

మిగతా 2వ పేజీలో..

## నరవణె పుస్తకంలోని వ్యాఖ్యల ఉల్లేఖిన

- లోక్‌సభలో రాహుల్ ప్రసంగంపై గందరగోళం
- అడ్డుకున్న మంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2 (చట్టం న్యూస్):** రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో సోమవారంనాడు గందరగోళం తలెత్తింది. విపక్ష నేత రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణెళి రాసిన పుస్తకంలోని ఒక వాక్యాన్ని ప్రస్తావించడంతో గందరగోళం చెలరేగింది. వెంటనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. నరవణెళి పుస్తకం ఇంకా పబ్లిష్ కాలేదని, ప్రచురితం కాని పుస్తకం నుంచి వ్యాఖ్యలను పార్లమెంటరీ ప్రొసీడింగ్స్‌లో ఎలా ప్రస్తావిస్తారని నిలదీశారు. స్జబెక్ట్‌పై మాట్లాడాలన్నారు. రాజ్‌నాథ్ సింగ్ లేవనెత్తిన అభ్యంతరాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సమర్థించారు. 'మ్యాగజైన్ ఏదైనా రాయవచ్చు. పుస్తకం అధికారికంగా ప్రచురితం కానప్పుడు దానికి విశ్వసనీయత ఉండదు' అని అన్నారు. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాహుల్ మాట్లాడటం సరికాదన్నారు. పార్లమెంటరీ విధివిధానాలను పాటించాలని సూచించారు. దీంతో స్పీకర్ జోక్యం చేసుకుని ఆ పుస్తకం ఎక్కడుందో చూపించాలని అడిగారు. ప్రతిపక్ష నేతగా మీరు ఆరోపణలు చేస్తున్నారే కానీ

మిగతా 2వ పేజీలో..

## ముఖ్యమంత్రిని దూషించడం క్షంతవ్యం కాదు

### అంబటి వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి వర్మ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి2**(చట్టం న్యూస్)** :ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన అసభ్య వ్యాఖ్యలను కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని తిట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమని, రాజకీయాల్లో నైతిక విలువలకు పూర్తి వ్యతిరేకమని విమర్శించారు. అంబటి రాంబాబు వ్యాఖ్యలు సభ్య సమాజం సిగ్గుపడేలా ఉన్నాయని సోమావరం నాడిక్కడ మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు కేంద్ర హోంమంత్రిని కలవవచ్చన్నారు. రాష్ట్రంలో వైసీపీ నేత చేసిన అసభ్య వ్యాఖ్యల కారణంగా రాష్ట్ర కూటమి నేతలు వ్యతిరేకత వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిందని రాష్ట్రపతి, హోంమంత్రిని కలవాలనుకోవడం వైసీపీ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని శ్రీనివాస్ వర్మ అన్నారు. గత ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు పరిమితమైన వైసీపీకి.. ప్రతిపక్ష హోదా లేదని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడం మంచిది కాదన్నారు.

మిగతా 2వ పేజీలో..

# లండన్ చేరుకున్న మంత్రి నారాయణ

### అమరావతి కోసం పలు ప్రాజెక్టుల అధ్యయనం



అమరావతి,ఫిబ్రవరి2 **(చట్టం న్యూస్):** రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా పలు ప్రాజెక్టులను అధ్యయనం చేసేందుకు గానూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ బృందం లండన్ చేరుకుంది. ఈ పర్యటనలో భాగంగా అక్కడ పలు కీలక ప్రాజెక్టులను పరిశీలించి, అమరావతిలో అమలు చేయగలిగే ఆధునిక పట్టణ ప్రణాళిక, స్పోర్ట్స్ సిటీ, రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై నారాయణ బృందం అధ్యయనం చేయనుంది. లండన్ కాలమానం ప్రకారం.. ఉదయం 11:00 గంటలకు లండన్ సిటీ కార్పొరేషన్ ఎ÷-లానింగ్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ గ్విన్ రిచర్డ్స్‌తో మంత్రి సమావేశం కానున్నారు. ఈ భేటీలో అమరావతి అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు, అంతర్జాతీయ సహకార అవకాశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే మధ్యాహ్నం 1:30 గంటలకు బెటర్సీ పవర్ స్టేషన్‌ను నారాయణ బృందం సందర్శించనుంది. అనంతరం థేమ్స్ రివర్ ఫ్రంట్ ప్రాంతాన్ని పరిశీలించనుంది. సాయంత్రం 4:30 గంటలకు లండన్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి.. అక్కడి బ్రిడ్జ్, సరౌండింగ్ ఏరియాల అభివృద్ధి, ట్రాన్స్‌పోర్ట్ ఇంటిగ్రేషన్ వంటి అంశాలను అధ్యయనం చేయనుంది. బృందంలో

మిగతా 2వ పేజీలో..

## మరింతగా దిగివస్తున్న బంగారం ధరలు

- 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,530కి చేరిక
- 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,38,900
- రూ.3 లక్షలకు చేరుకున్న కిలో వెండి ధర

**హైదరాబాద్,ఫిబ్రవరి2(చట్టం న్యూస్):** బంగారం, వెండి ధరలు పెట్టుబడిదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో భారీగా పెరిగిన వెండి, బంగారం ధరలు గత నాలుగైదు రోజులుగా

మిగతా 2వ పేజీలో..

## బంగ్లా చెరనుంచి బయటపడ్డ మత్స్యకారులు

**మొదటి పేజి తరువాయి..**

చేరుకున్నారు. ఈ మత్స్యకారులంతా విజయనగరం జిల్లాకు చెందినవారు. ఆర్డీవో ఎస్.సుధాకర్, ఫిషరీస్ డిపా÷-టం÷-మెంట్ జాయింట్ డైరెక్టర్ ఎస్. లక్ష్మణరావు, ఎపి మేకనైజ్డ్ బోటు అసోసియేషన్ అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు, చీకటి రమేష్, గరికిన రవి, తదితరులు కలిసి తీర ప్రాంతానికి చేరుకున్న మత్స్యకారులకు స్వాగతం పలికి వారందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.

## వికసిత భారత్ లక్ష్యానికి అనగుణంగా బ్జడెట్

**మొదటి పేజి తరువాయి..**

నరేంద్ర మోదీకి దక్కుతుందని ఉద్ఘాటించారు. పేదరికం నుంచి 25 కోట్ల మందిని బయటకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.3 వేల కోట్లకు పైగా కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చిందని పురందేశ్వరి వ్యాఖ్యానించారు. 'గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల కోసం రూ.500 కోట్లకుపైగా నిధులు ఇచ్చింది. అమరావతిలో మౌలిక వసతుల కోసం నిధులు కేటాయించింది. పోలవరం, అమరావతికి కలిపి రూ.3800 కోట్ల వరకు నిధులు వచ్చాయి. 16వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రాలకు నిధులు వస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్‌లోనూ జిల్లాల ప్రస్తావన ఉండదు. కానీ కేంద్ర బ్జడెట్‌లో రాష్ట్రాల వారీగా కాకుండా మంత్రిత్వ శాఖలకు కేటాయింపులు ఉంటాయి. ఆయా రాష్ట్రాలకు చెందిన మంత్రులను దృష్టిలో ఉంచుకుని.. అక్కడి పరిస్థితుల ఆధారంగా ప్రాజెక్టులకు నిధులు కేటాయించిందని పురందేశ్వరి అన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేలా బ్జడెట్ ఉంది. ప్రపంచ అవసరాలకు సరిపడేలా మన దేశంలో యువత ఉన్నారు. మహిళల సాధికారత కోసం ప్రతి జిల్లాలో మహిళలకు హాస్టల్స్ ఏర్పాటు చేస్తుంది. సంప్రదాయ విజ్ఞానం కొనసాగించేందుకు బ్జడెట్‌లో నిధులు కేటాయించారు' అని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని ఎంపీ తెలిపారు. 'చేనేత వృత్తులకు ప్రోత్సాహం కల్పించేలా ఓడీఓపీ ద్వారా చేతివృత్తుల వారికి లాభం చేకూరుతుంది. రాజమండ్రి, కాకినాడతో సహా నగరాల అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. కొబ్బరి, కోకో, జీడి మామిడి రైతులకు ప్రోత్సాహం అందించేలా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. కొబ్బరి, కోకో ఉత్పత్తిలో ఏపీ దేశంలో రెండో స్థానంలో ఉంది. అనంతపురంలో మోనోజైట్ నిక్షేపాలు ఉన్నాయి. శ్రీకాకుళం, నెల్లూరులో రేర్ ఎర్త్ మినరల్స్ ఉన్నాయి. డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్‌లో ఉపయోగించే మినరల్స్ ఏపీలో ఉన్నాయి. వికసిత భారత్ కావాలంటే వికసిత ఆంధ్రప్రదేశ్ కావాలి.. వికసిత రాష్ట్రాలు కావాలి.. ఆ దిశగా కేంద్ర బడ్జెట్ ఉందని ఎంపీ చెప్పారు.

## తిరుమల లడ్డూపై ఎందుకు మాట్లాడరు

**మొదటి పేజి తరువాయి..**

సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. 32 మందితో క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, అలాగే పొలిటికల్ అ్ఫ÷ర్స్ కమిటీని పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నేత, ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ వివాదంపై చర్చించామని, కమిటీ రిపోర్ట్ ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు

**మొదటి పేజి తరువాయి..**

ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ఉద్ఘాటించారు. శాంతిభద్రతలను ఉల్లంఘించే ప్రయత్నాలు జరిగితే కఠిన చర్యలు
తీసుకుంటామని కూడా ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో జరుగుతున్న పునర్నిర్మాణ ప్రక్రియను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని సీఎం విమర్శించారు. వారు విధ్వంసం చేసిన వ్యవస్థలను మళ్లీ నిర్మిస్తున్న తీరును చూసి అసహనంతో దూషణలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు సేవ చేయడం, వారికి సాధికారిత కల్పించడమే తమ ప్రభుత్వ సిద్దాంతమని స్పష్టం చేశారు. ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళు _న్న ప్రభుత్వంపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు సేవ చేయటం, వారికి సాధికారిత కల్పించటమే తమ ప్రభుత్వ సిద్దాంతమని తెలిపారు. పాలనలో పారదర్శకత, చట్టబద్ధత, బాధ్యతాయుత పాలన తమ లక్ష్యాలని స్పష్టం చేశారు. వైసీపీ నిజ స్వరూపం ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతోనే ఆ పార్టీ నాయకులు అసహనంతో వ్యవహరిస్తున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి పాలన విధించాలనడం రాజకీయ కుట్రే

**మొదటి పేజి తరువాయి..**

ప్రత్యర్థులను అణచివేసేందుకు ఇలాంటి చర్యలే చేపట్టిందని గుర్తు చేశారు. అధికారం కోల్పోయాక కూడా అదే విధమైన నేర రాజకీయాలను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై జగన్‌కు ఎప్పుడూ నమ్మకం లేదని, విధ్వంసకర రాజకీయాలకు ఆయనే మూల కారణమని వ్యాఖ్యానించారు. శాసనసభ లోపల, వెలుపల.. సీఎం చంద్రబాబుపై జగన్ అనుచరులు అసభ్యకరమైన భాషను ఉపయోగిస్తున్నారని ్÷ర్ అయ్యారు. ప్రజలచే ఎన్నికోబడిన నాయకుడిగా ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే ధైర్యం జగన్‌కు లేదని యనమల ఎద్దేవా చేశారు. శాంతిభద్రతలు విఫలమయ్యాయని తప్పుడు ప్రచారం చేస్తూ, బలవంతంగా అధికార పీఠాన్ని చేజిక్కించుకోవాలని జగన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు యనమల. వైసీపీ వర్గ రాజకీయ ప్రవర్తన.. రాష్ట్రాన్ని మాఫియా కార్యకలాపాలకు కేంద్రంగా మార్చే ప్రమాదముం దన్నారు. జగన్ రాజకీయాల్లోని నీచత్వాన్ని ప్రజలు గమనించాలని యనమల రామకృష్ణుడు సూచించారు.

## ముఖ్యమంత్రిని దూషించడం క్షంతవ్యం కాదు

**మొదటి పేజి తరువాయి..**

గౌరవప్రదమైన రాజకీయాలు చేయాలని ఆయన సూచించారు. ఏపీలో వైసీపీ ఆవిర్భావం కావడం రాష్ట్ర ప్రజల కర్మ అని కేంద్రమంత్రి వ్యాఖ్యానించారు. వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులను దూషించడం మంచిది కాదన్నారు శ్రీనివాస్ వర్మ. కొడాలి నాని, అప్పలరాజు, అంబటి రాంబాబు లాంటివారు దూషణలు చేస్తున్నా.. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జగన్ ఇలా మాట్లాడొద్దని చెప్పిన సందర్భాలు లేవని పేర్కొన్నారు. భార్యాబిడ్డలను తిడుతుంటే జగన్ మోహన్ రెడ్డి ఆనందపడిన తీరును అందరూ చూశారని మంత్రి శ్రీనివాస్ వర్మ చెప్పుకొచ్చారు.

## లండన్ చేరుకున్న మంత్రి నారాయణ

**మొదటి పేజి తరువాయి..**

మంత్రి నారాయణతో పాటు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్‌లు ఉన్నారు. ఈ పర్యటన ద్వారా అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఆధునిక ఆలోచనలు, టెక్నాలజీలు సేకరించడమే లక్ష్యమని తెలుస్తోంది. ఈ నెల 2, 3 తేదీల్లో లండన్‌లో.. 4, 5 తేదీల్లో దోహాలో ఈ బృందం పర్యటించనుంది.

# "పదేళ్లు పత్తాలేరు.. ఇప్పుడొచ్చి దండాలు పెడుతున్నారా?"





- **పేదోళ్లకు రేషన్ కార్డు ఇవ్వనోళ్లు.. ఓట్లడిగేందుకు ఏ ముఖం పెట్టుకొస్తున్నారు?**
- **మిమ్మల్ని ముంచింది 'కారు' సర్కారు.. గట్టెక్కించేది 'హస్తం' ప్రభుత్వమే!**
- **ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచార హోరులో గులాబీ నేతలపై మంత్రి పొంగులేటి నిప్పులు!**

ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 2 ఏదులాపురం మున్సిపాలిటీ : "పదేళ్ల పాటు ప్రజలను గాలికొదిలేసి.. ఇవాళ ఎన్నికలు రాగానే దండాలు పెట్టుకుంటూ వస్తున్న నాయకులను నమ్ముదామా? పేదోడికి ఓ రేషన్ కార్డు ఇవ్వడానికి మనసు రాని వాళ్లకు మళ్లీ ఓట్లు వేయాలా?" అంటూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గులాబీ నేతలపై విరుచుకుపడ్డారు. సోమవారం ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2, 22, 23, 24, 26, 27వ వార్డుల్లో నిర్వహించిన రోడ్ షోల్లో ఆయన ప్రసంగం ఆద్యంతం వాడివేడిగా సాగింది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ సంక్షేమం అర్హుల దరిచేరకుండా వారిని నమ్మించి మోసం చేసిన ఘనత ముమ్మాటికీ వారిదేనని ఎద్దేవా చేశారు. ఇప్పుడు తాము చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గాలి మోటార్ల నాయకులకు.. గల్లీ కష్టాలేం తెలుసు? గత ప్రభుత్వ తీరుపై పొంగులేటి తనదైన శైలిలో సెటైర్లు వేశారు. "నాడు ఫామ్ హౌస్‌లకే పరిమితమై, గాలి మోటార్లలో తిరిగిన నాయకులకు.. ఈ గల్లీల్లో డ్రైనేజీలు పొంగుతుంటే, ఇళ్లు మునుగుతుంటే ఏనాడైనా కనిపించాయా?" అని నిలదీశారు. రాజీవ్ గృహకల్ప వాసులు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని వారు, ఇవాళ ఎన్నికల కోసం కొత్త నాటకాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డులు ఇచ్చి ఆకలి తీర్చామని, అది కాంగ్రెస్ మార్కు పాలన అని చెప్పారు.

**ముంపు కష్టాలకు 'రిటైనింగ్' చెక్!**

"మాట ఇస్తే మడమ తిప్పే అలవాటు తనకు లేదన్నారు... జూన్ కల్లా కరకట్ట పూర్తి చేసి మీ ముంపు కష్టాలు తీర్చి తీరుతా" అని మంత్రి మరోమారు హామీ ఇచ్చారు. రూ. 690 కోట్లతో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ ఏదులాపురానికి రక్షణ కవచంలా మారుతుందని, రాజీవ్ గృహకల్ప ఇళ్లకు కొత్త హంగులు అద్దడంతో పాటు ప్రతి ఇంటికీ నల్లా నీరు ఇచ్చే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో కలిపి సుమారు రూ.308 కోట్లతో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని, ఏదులాపురాన్ని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. అభివృద్ధి కావాలంటే హస్తం గుర్తుకే ఓటేయాలని, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పొంగులేటి పిలుపునిచ్చారు.

# ఫార్వర్డ్ బ్యాక్ పార్టీలో చేరిన బీసీ ఉద్యమ నేత శ్రీధర్ రాజు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 2 ,( చట్టం బ్యూరో )**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీనియర్ బీసీ సంఘాల నేత కేశి పెద్ది శ్రీధర్ రాజు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఆధ్వర్యంలో

**ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేయడం జరిగింది.**

సోమవారం రోజు కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి, శ్రీధర్ రాజుకు
ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా జోజి రెడ్డి మాట్లాడుతూ శ్రీధర్ రాజు గత 36 సంవత్సరాలుగా బీసీ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలు సాధనకై పార్టీలో చేర్దానం వచ్చి చేరాలని.. భవిష్యత్తులో శ్రీధర్ రాజుకు పార్టీలో



సంస్కృత స్థానం కల్పిస్తామని తెలిపారు.కరీంనగర్ నగరపాలక సంస్థ 63వ డివిజన్ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా శ్రీధర్ రాజును ప్రకటిస్తున్నామని తెలిపారు.
తెలంగాణ రాష్ట్రంలో సుభాష్ చంద్రబోస్ యొక్క ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లేందుకు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్రంలో అన్ని మున్సిపల్ ఎలక్షన్లలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జెండాను ఎగరవేస్తామని తెలిపారు.రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎదగబోతుందని అన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శ్రీధర్ రాజు చేరిక భవిష్యత్తులో పార్టీ అభివృద్ధికి ఎంతో గాను దోహదపడుతుందని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు.
ఈ సందర్భంగా పార్టీలో చేరిన శ్రీధర్ రాజు మాట్లాడుతూ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ భవిష్యత్తులో మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని 63వ డివిజన్ లో సింహం గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ. ఐ.ఎస్ బి రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్,చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి ముత్యాల విజయ్ కుమార్, నాయకులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
--------

## మేడిపల్లి ధరణి కాలనీ నూతన అసోసియేషన్ సభ్యులకు సన్మానం...

**శాలువాలతో సత్కరించిన తుంగతుర్తి రవి**





**మేడిపల్లి,02 ఫిబ్రవరి(చట్టం)** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 9వ డివిజన్ మేడిపల్లి ధరణి కాలనీ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో కాలనీ అధ్యక్షులుగా చింతం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా బీమిడి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా గూగులోతు చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విజేతలు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తామని, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. అనంతరం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధి కోసం తనవంతు సహాయంగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, కాలనీలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీలత భద్రు నాయక్, మనిరాం నాయక్, మహ్మద్ మజర్, నాగరాజు, కాలనీ మాజీ అధ్యక్షులు ప్రకాష్‌తో పాటు పలువురు కాలనీ వాసులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

## భద్రత కల్పించాలంటూ హైకోర్టులో జోగి పిటిషన్

**విజయవాడ,ఫిబ్రవరి2 :** వైసిపి సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ తన భద్రత విషయమై ఎపి హైకోర్టును ఆశ్రయించారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలోని తన నివాసంపై టిడిపి కార్యకర్తలు దాడి చేశారని ఆరోపిస్తూ తనకు భద్రత కల్పించాలని కోరుతూ ఆయన లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు ఆయన కుమారుడు జోగి రోహిత్ కుమార్ కూడా హైకోర్టులో మరో లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. తమ ఇంటిపై దాడి జరిగే అవకాశం ఉందని పోలీసులకు ముందుగానే సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదని రోహిత్ తన పిటిషన్‌లో ఆరోపించారు. గుంపులుగా వచ్చిన వ్యక్తులు దాడి చేస్తుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకుండా కేవలం ప్రేక్షకపాత్ర పోషించారని పేర్కొన్నారు. తమకు, తమ కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, వెంటనే భద్రత కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దాడికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఆధారాలుగా కోర్టుకు సమర్పిస్తున్నట్లు పిటిషన్‌లో తెలిపారు. ఈ రెండు పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం కాసేపట్లో విచారణ జరపనుంది.

## నరవణె పుస్తకంలోని వ్యాఖ్యల ఉల్లేఖన

**మొదటి పేజి తరువాయి..**

సభ నిబంధనలను పాటించడం లేదన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. దీంతో రాహుల్ వెంటనే స్పందించారు. 'ఏమి మాట్లాడమంటారో దయచేసి మీరే చెప్పండి' అన్నారు. దీనిపై స్పీకర్ వెంటనే జవాబిచ్చారు. నేను మీ సలహాదారుని కాదు. స్పీకర్‌గా సభ సజావుగా సాగేలా చూడటం నా బాధ్యత. నిర్దేశిరచిన స్జబెక్ట్ మీదే చర్చ ఉండాలి' అన్నారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

## మరింతగా దిగివస్తున్న బంగారం ధరలు

**మొదటి పేజి తరువాయి..**

అంతే స్థాయిలో పతనమవుతున్నాయి. ఆల్ టైమ్ గరిష్టానికి చేరుకున్న బంగారం, వెండి ధరల్లో భారీగా లాభాల స్వీకరణ జరుగుతుండడమే దీనికి కారణంగా కనిపిస్తోంది. కొనుగోలుదారులకు ఆనందాన్ని కలిగించకున్నా కొంతమేర దిగివస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి సోమవారం ఉదయం 9:30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,51,530కి చేరింది. నిన్నటి ధరతో పోల్చుకుంటే ఏకంగా 9,050 రూపాయలు తగ్గింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,38,900కి చేరింది. నిన్నటి ధరతో పోల్చుకుంటే 8,300 రూపాయలు తగ్గింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1,51,680కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,39,050కి చేరుకుంది.మరోవైపు ఇటీవల భారీగా పెరిగిన వెండి కూడా వేగంగా పతనమవుతోంది. ఐదు రోజుల క్రితం రూ.4.25 లక్షలకు చేరిన కిలో వెండి కొద్ది రోజుల్లోనే తిరిగి రూ.3 లక్షలకు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే కిలోకు రూ.50 వేల మేర తగ్గింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.3 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా కిలో వెండి ధర రూ.3 లక్షలుగా ఉంది.

## బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హదరాబాద్

**మొదటి పేజి తరువాయి..**

భయంతోనే లోక్‌సభలో తన ప్రసంగం మొదట్లోనే అడ్డుకున్నారని చెప్పారు. లోక్‌సభ వాయిదా పడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మాజీ ఆర్మీ చీఫ్ పుస్తకం బయటకు వస్తే మన సైన్యాన్ని ప్రభుత్వ నేతలు ఎలా నిరాశపరుస్తున్నరనేది ప్రజలు తెలుసుకుంటారని చెప్పారు. మాజీ ఆర్మీ చీఫ్ తన దృష్టికోణాన్ని ఎందుకు చెప్పకూడదు? ఆయన ఏమి చెప్పి ఉంటారని ప్రభుత్వం భయపడుతోంది? అని రాహుల్ ప్రశ్నించారు. 'ప్రధాన మంత్రి గురించి, రాజ్‌నాథ్ సింగ్ గురించి పుస్తకంలో స్పష్టంగా రాశారని నేను చెప్పదలచుకున్నాను. ఒక ఆర్టికల్‌లో కూడా ఈ విషయం వచ్చింది. నేను ఆ ఆర్టికల్‌ను ప్రస్తావించాను. దాంతో నన్ను మాట్లాడకుండా అడ్డుకున్నారు. అసలు విషయాలు బయటకు వస్తాయనే భయమే అందుకు కారణం. మాజీ ఆర్మీ చీఫ్ తన పుస్తకంలో ఏమి రాశారో, ఆయనకు రాజ్‌నాథ్ సింగ్, ప్రధాని మోదీ ఏ ఆదేశాలు ఇచ్చారో, వారి మధ్య జరిగిన సంభాషణలు ఏమిటో సభలో చెప్పాలనుకున్నాను. కానీ రెండు,మూడు లైన్లు మాట్లాడగానే నన్ను ప్రసంగించకుండా అడ్డుకున్నారు' అని రాహుల్ తెలిపారు.

# త్రివేణి స్కూల్ ఎన్సిసి ఆఫీసర్ శ్యాంసింగ్‌కి పదోన్నతి

**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 2** ఖమ్మం పట్టణంలో త్రివేణి పాఠశాలకు చెందిన పీ ఈ టి మరియు అసోసియేట్ ఎన్సిసి ఆఫీసర్(ఎ ఎన్ ఓ) గా విధులు నిర్వహిస్తున్న శ్యాంసింగ్ కి థర్డ్ ఆఫీసర్ నుంచి సెకండ్ ఆఫీసర్ గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా 11( టి) బెటాలియన్ కార్యాలయంలో నిర్వహించిన ర్యాంక్ సెర్మని కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ , కల్నల్ ఎస్కే భద్ర మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నవీన్ యాదవ్ యాదవ్ కలిసి శ్యాంసింగ్ భుజాలపై షోల్డర్ స్టార్స్ ను అధికారికంగా ధరింపజేశారు.

ఈ కార్యక్రమం సైనిక సాంప్రదాయాలు క్రమశిక్షణతో అత్యంత గౌరవప్రదంగా నిర్వహించబడింది . శ్యాంసింగ్ ఎన్సిసి క్యాడేట్ల శిక్షణలో క్రమశిక్షణ, దేశభక్తి,నాయకత్వ లక్షణాల అభివృద్ధికి, అంకితభావంతో సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఈ పదోన్నతి లభించడం గర్వకారణంగా నిలిచింది.

ఈ సందర్భంగా త్రివేణి ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ తోటి పి ఈ టి మిత్రుడు సెకండ్ ఆఫీసర్ గా పదోన్నతి పొందడం మాకు, మా సంస్థకు,చాలా గర్వంగా ఉందని తెలియజేశారు. స్కూల్ యాజమాన్యం మరియు ఉపాధ్యాయ బృందం శ్రేయోభిలాషులు సెకండ్ ఆఫీసర్ శ్యాంసింగ్ కి హృదయపూర్వక అభినందనలు




తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

----------

# కరీంనగర్ జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రతిభాపాటవ పరీక్ష ;





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 2 , ( చట్టం బ్యూరో )** జిల్లాస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభ పోటీలు కరీంనగర్ లోని సాన్వి జూనియర్ కాలేజ్ నందు నిర్వహించబడినది. రాష్ట్ర స్థాయి సాంఘిక శాస్త్ర ఫోరం అధ్యక్షుల వారి సూచనల మేరకు పాఠశాల మండల స్థాయిలో పోటీలు నిర్వహించబడినది. ఆ తర్వాత జిల్లాలోని 16 మండలాల నుండి జడ్.పి.హెచ్.ఎస్ విభాగం మోడల్ స్కూల్ కేజీబీవీ భాగాల నుండి విద్యార్థులు పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి శాన్వి విద్యాసంస్థల చైర్మన్ శ్రీ మునీందర్ సహకరించారు.

ఇందులో జడ్.పి.హెచ్.ఎస్ విభాగం నుండి ప్రథమ బహుమతి జెడ్పిహెచ్ఎస్ కొత్తపల్లికి చెందిన కుతిజా బేగం, ద్వితీయ జడ్.పి.హెచ్.ఎస్ చామనపల్లికి చెందిన ఎస్ చందు, తృతీయ బహుమతి జెడ్పిఎస్ చెల్పూర్ కి చెందిన పి విశ్వేస్ ఎంపికయ్యారు.

మోడల్, కేజీబీవీ విభాగం నుండి ప్రథమ బహుమతి టీజీఎమ్ఎస్ ఎలగందల్ కు చెందిన కే సాత్విక్ , ద్వితీయ బహుమతి టీజీఎమ్ఎస్ పోచంపల్లికి చెందిన బి. అలేఖ్య, తృతీయ బహుమతి టీజీఎమ్ఎస్ రుక్మాపూర్ కు చెందిన ఏ. గౌతమి ఎంపికైనారు.

డి సి ఈ బి,సెక్రటరీ శ్రీ భగవంతయ్య గారు ప్రశ్న పత్రాన్ని విడుదల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు

ఈ కార్యక్రమానికి క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీ అశోక్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఫోరం జిల్లా శాఖను అభినందించారు.

కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు బి. తిరుపతి గారు అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. కుమారస్వామి, కోశాధికారి పుల్లూరి రవీందర్, ఉపాధ్యక్షులు ముంతాజ్ ఫాతిమా, రాష్ట్ర బాధ్యులు అవధూత శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు కిరణ్ అండ్ సంపత్ ముల్కల కుమార్, శివకుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల విజయంతోటే ఎదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుంది

### పాలేరు అసెంబ్లీ ఇంచార్జ్ నున్నా రవికుమార్

ఖమ్మం బ్యూరో చట్టం న్యూస్ పిబ్రవరి 2

నూతనంగా ఏర్పడిన ఎదులాపురం మున్సిపాలిటీ గత పది సంవత్సరాలుగా పాలకవర్గం లేకుండా ఇక్కడ ప్రజాప్రతినిధులు లేకుండా అభివృద్ధి జరగకుండా అడ్డుకున్న గత ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలు అయినా కూడా ఈ ప్రాంతం నుంచి గెలిచి ప్రభుత్వంలో కీలక భాగస్వామ్యం వహీస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటికీ ఏదులాపురం మున్సిపాలిటీని పట్టించుకున్న దాఖలాలు లేవు ఎన్నికలు వస్తున్న సందర్భంగా హడావుడిగా శంకుస్థాపనలు చేసి ప్రజలను మభ్యపెట్టి మళ్లీ ఓట్లను దండుకుని ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు గతంలో ఎదులాపురం పరిధిలో వామపక్ష పార్టీలకు మిగతా పార్టీలకు కూడా అవకాశం ఇచ్చి ఉన్నారు అభివృద్ధి మాత్రం జరగలేదు నిరుద్యోగ యువత, మహిళలు అనేకమంది





అసంఘటిత కార్మికులు ఒక్కసారి భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించి కేంద్రం నుంచి వస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలు నేరుగా ప్రజలకు అందించి సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం ఎదులాపురం మున్సిపాలిటీ ప్రజల అందరి కర్తవ్యం అని

నున్నా రవికుమార్ అన్నారు.

మున్సిపాలిటీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగింది

ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో 4, వ వార్డ్ అభ్యర్థి శ్రీరంగం మాధవి ,6 వ వార్డ్ హలావత్ లక్ష్మీ వారి విజయాన్ని కాంక్షిస్తూ వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు టేకుమట్ల వీరు ,వేల్పుల సుధాకర్ , నల్లమాస శ్రీనివాస్ , పాగర్తి సుధాకర్ ,మల్లెబోయిన గోవిందరావు , వీరన్న ,కందరబోయిన గోపి ఇంకా తదితర మండల నాయకులు పాల్గొని భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల విజయం కోసం ప్రచారం నిర్వహించడం జరిగింది. భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు అందరూ స్వచ్ఛందంగా ఎదులాపురం మున్సిపాలిటీలో అన్ని వార్డులలో విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునివ్వడం జరిగింది

# వైసీపీ కన్వీనర్ పూల ప్రసాద్ కుటుంబానికి సాంబశివారెడ్డి చేయూత





**నార్పల ఫిబ్రవరి 2, (చట్టం) న్యూస్ :** శింగణమల వైసీపీ మండల కన్వీనర్ పూల ప్రసాద్ అకాల మరణంతో పార్టీ శ్రేణులు దిగ్భ్రాంతికి గురయ్యాయి. ఈ విషాద సమయంలో పూల ప్రసాద్ కుటుంబానికి వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్నారై కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఆర్థికంగా అండగా నిలిచారు. శింగణమల గ్రామానికి వెళ్లిన సాంబశివారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పూల ప్రసాద్ ఇద్దరు కుమారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఒక్కొక్కరి పేరు మీద రూ.50 వేల చొప్పున మొత్తం లక్ష రూపాయల ఫిక్స్ డిపాజిట్ చేయించి బాండ్లను ఆయన భార్యకు అందజేశారు. చిన్ననాటి స్నేహబంధాన్ని గుర్తు చేసుకున్న సాంబశివారెడ్డి, కలిసి చదువుకున్న రోజుల జ్ఞాపకాలు మనసును కలచివేశాయని అన్నారు కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటానని, పిల్లల భవిష్యత్తుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని సాంబశివారెడ్డి భరోసా ఇచ్చారు రాజకీయాల్లో తనదైన శైలితో ప్రజల నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఆలూరు సాంబశివారెడ్డి, చిన్ననాటి స్నేహితుడు పూల ప్రసాద్ కుటుంబానికి సహాయం అందించి తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ సొసైటీ అధ్యక్షులు బొమ్మన శ్రీరామ్ రెడ్డి వీరాంజనేయులు. ప్రతాపరెడ్డి. మల్లికార్జు రెడ్డి. దిద్దుకుంట భాస్కర్ రెడ్డి. నాగవర్ధన్ రెడ్డి. ఎల్ రాజు. వెంకట్ నారాయణ. శ్రీకాంత్ రెడ్డి. తిరుపతయ్య. రమణ. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

# గ్రీవెన్స్ లో పువ్వాడ నగర్ సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన సర్పంచ్...... సిద్దిక్



**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 2 :** రఘునాథపాలెం మండల కేంద్రం లోని పువ్వాడ నగర్ గ్రామ పంచాయితీ లో పువ్వాడ నగర్ గ్రామం లో ప్రభుత్వ పాఠశాల పర్మినెంట్ బిల్డింగ్ ఏర్పాటు మరియు గ్రామం లో ఆశా వర్కర్ నియమించించుట గురించి నేడు గ్రీవెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ ని కలిసి వినతి పత్రం అందచేసి సమస్య ను వివరించిన గ్రామ సర్పంచ్ షేక్ సిద్దిక్ గ్రామం ప్రభుత్వ పాఠశాల పర్మినెంట్ బిల్డింగ్ అవసరం అని మండల ప్రాథమిక పాఠశాల గా ఉన్న స్కూల్ ను 7 వ తరగతి వరకు స్కూల్ అప్గ్రేడ్ చెయ్యాలని కోరారు మరియు గ్రామం లో ఆశ వర్కర్ ను కేటాయించాలని తెలిపారు.సందించిన కలెక్టర్ పాఠశాల సమస్య ను జిల్లా విద్యాశాఖ అధికారి కి బదిలీ చేసారు.ఈ కార్యక్రమం కర్నె రాములు, జనార్దన్, సాధిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిన కేంద్ర ప్రభుత్వం

### ఏ. ఐ. ఎస్. బి రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్



ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 2 ,( చట్టం బ్యూరో ) బిజెపి కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని ఏఐఎస్బి రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిడిపి వాటా ప్రకారం కేటాయించాల్సిన నిధులు కూడా కేటాయించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కేంద్రీయ ప్రైవేటు యూనివర్సిటీలకు విచ్చలవిడిగా అనుమతులు మంజూరు చేసే విధంగా వాళ్లకు అనుమతులు కల్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యారంగానికి నిధులు కేటాయించకుండా కార్పోరేట్లకు పెద్దపీట వేశారని దుయ్యబట్టారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం విద్యపై జిడిపిలో 6% నిధులు కేటాయిస్తామని చెప్పారని కానీ ఆ నిధులు ఏమాత్రం కేటాయించలేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో తీవ్రంగా విపలమైందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో అనిల్ గౌడ్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# పగడాల శ్రీవిద్యను అరామర్శించిన ప్రశాంతి లక్ష్మి షేక్ షకిన



**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 2 :** ఖమ్మం నగర బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజును అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన సందర్భంగా పగడాల నాగరాజు సతీమణి 53వ డివిజన్ కార్పొరేటర్ పగడాల శ్రీవిద్యను వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, ధైర్యం చెప్పిన 20వ డివిజన్ బీ ఆర్ ఎస్ పార్టీ కార్పొరేటర్ బిక్కసాని ప్రశాంతి లక్ష్మి, నగర బి ఆర్ ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి షేక్. షకినా, 21వ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ ఇన్ చార్జి షేక్. ఉస్మాన్, యుత్ నాయకులు కందాల వీరెందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రాధా కిషోర్ బర్త్ డే వేడుకల్లో పాల్గొన్న తుమ్మల యుగంధర్ నాగండ్ల యరగర్ల కూచిపూడి



ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 2

కాంగ్రెస్ నాయకులు మాజీ మార్కెట్ చైర్మన్ మానుకొండ రాధ కిషోర్ మనవడి బర్త్డే వేడుకలలో పాలొగొన్న రాష్ట్ర క్యాంగ్రెస్ నాయకులు డాక్టర్ తుమ్మల యుంగేందర్ మరియు నగర కమిటీ అధ్యక్షులు దీపక్ చౌదరి , ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పొరేటర్ వడ్డే బోయిన నరసింహరావు.మార్కెట్ చైర్మన్ హనుమంత్ రావు , బెల్లంకొండ వాసు 58 వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు కూచిపూడి శ్రీనివాస చౌదరీ మరియు ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

# మసిపూసి మారేడుకాయ !

మసిపూసి మారేడుకాయ చేయడమంటే ఇదే. దేశంలో ప్రజల ఆకలిబాధలను, పరిస్థితులను,రోదనలను పట్టించుకోకుండా బడ్జెట్ యధావిధిగా ప్రవేశ పెట్టారు. గత 9 ఏళ్లుగా నిర్మలా సీతారామన్ బడ్జెట్ వల్ల దేశంలో మార్పులు ఏమైనా వచ్చాయా అని చర్చిస్తే..వచ్చాయనే చెప్పాలి. దేశంలో ఆర్థిక మందగమనం సాగుతోంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గింధి. నిత్యాసవర వస్తువులతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయి. ముఖ్యంగా ఔషధాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కోవిడ్ తరవాత ధరలను పరిశీలిస్తే 200 నుంచి 500 శాతం వరకు ఔషధాల ధరలు పెరిగాయి. సామాన్యులు వైద్యం చేయించుకునే మాటెలా ఉన్నా..మందులు కొనుక్కుని వేసుకునే దిక్కులేకుండా పోయింది. మరి బడ్జెట్ ప్రగతిశీలమైతే ఇవన్నీ ప్రభావం చూపాలి. చూపడం లేదంటే బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదని గుర్తించాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మార్పురావడం లేదు. ప్రజల చేతుల్లో డబ్బులు ఆడడం లేదు. సంపాదించింది తిండికి కూడా సరిపోవడం లేదు. ఇలా నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి సామాన్యులను నిజంగానే వంచించింది. ఒకదాని తరువాత ఒకటిగా చోటుచేసుకుంటున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ ఆర్థిక సర్వే చేసిన హెచ్చరికలను సైతం బేఖాతరు చేసింది. కొద్దిమంది కోటీశ్వరుల ప్రయోజనాలను రక్షించేదిగా మాత్రమే బడ్జెట్ ఉంది. వరుసగా తొమ్మిదవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలోఘనంగా చెప్పిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' నిర్దాక్షిణ్యంగా సగటుజీవి పైనుండి దూసుకెళ్ళింది. ఫలితం 53,47,315 కోట్ల రూపాయల బడ్జెట్ సామాన్యులను ప్రమాదంలోకి నెట్టింది. కార్పొరేట్లకు, కోటీశ్వరులకు రాయితీలు, వరాల వర్షం కురిపించి నప్పుడు గుర్తుకురాని ఆర్థిక క్రమశిక్షణ కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు, మధ్య తరగతి ప్రజానీకానికి మాత్రం గుర్తు చేశారు. దేశంలోని కోటానుకోట్ల జనానికి మేలు చేసేదిలా బడ్జెట్ లేదన్నది ముమ్మాటికీ నిజం. ప్రతిపక్ష సభ్యులు మొదలు, ఆర్థిక సంస్కరణ అభిలాషులు సైతం దీనిని అంగీకరిం చారు. ఫలితంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం ఇలా ఒకటేమిటి?అన్ని రంగాల సాధారణ ప్రజానీకానికి సంబంధించిన పథకాల కేటాయింపుల్లో కోతలు పడ్డాయి. చివరికి, మహిళా సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించే 'జెండర్ బ్జడెట్'కూ నిధులలోనూ కోత పెట్టడం మోడీ సర్కారు తీరుకు నిదర్శనం. దీంతో రానున్న రోజుల్లోనూ నిరుద్యోగం, అధికధరలు, జీవన వ్యయాలు పెరగడం, ఉపాధి కోత వంటి కష్టాలు తప్పవన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కేంద్రబడ్జెట్‌లో సామాన్యులకు నేరుగా ప్రయోజనం కల్పించే చర్యలు పెద్దగా లేవు. గత ఏడాదిలో ఆదాయ పన్ను, జీఎస్టీల్లో భారీ కోతలతో ఉపశమనం కల్పించిన ప్రభుత్వం ఈసారి వాటి జోలికి వెళ్లలేదు. అయితే పలు విభాగాల్లో మినహాయింపు లను ఇవ్వడం ద్వారా పరోక్షంగా సాయం చేసేందుకు ప్రయత్నించినట్లు చెప్పుకుంది. అయితే అది ఏమేర ప్రతిఫలిస్తుందన్నది చూడాలి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో.. మధ్య తరగతి వారు, చిన్న ఇన్వెస్టర్లకు పలు అంశాల్లో మినహాయింపులను ప్రకటించారు. వ్యవసాయం, విద్య, చిన్న పరిశ్రమలు, ఆరోగ్య రంగం, ÷నాన్షియల్ మార్కెట్లు, ఐటీ రంగం, రవాణా మౌలిక వసతులు, పర్యాటకం, క్రీడా రంగాల ద్వారా సామాన్యులకు పరోక్షంగా ప్రయోజనం కల్పించే చర్యలను మంత్రి వెల్లడించారు. పోటీతత్వం పెంచడంతోనే ఆర్థికవృద్ధిని వేగవంతం చేయగలమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఉత్పాదకతను, పోటీతత్వాన్ని పెంచడం ద్వారా నిలకడగల ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, వారి సామర్థ్యాలను మెరుగుపరచడం, ప్రతి కుటుంబం, సమాజం, ప్రాంతం వృద్ధికి వనరులు, అవకాశాలను పొందేలా చూడటం అనే మూడు 'కర్తవ్యాలు'ను ప్రభుత్వం చేపట్టిందని మంత్రి పేర్కొన్నా.. గత 9 ఏళ్లుగా ఇవేమీ కనిపించడం లేదు. ఏటా కొత్తకొత్త ప్రకటనలతో మభ్య పెట్టడం సాధ్యం కాదని పాలకుల తెలుసుకుంటే మంచిది. ఈ కర్తవ్యాలను సక్రమంగా నెరవేర్చడానికి సంస్కరణల ఎక్స్‌ప్రెస్ వేగంగా ముందుకు సాగుతుందని వ్యాఖ్యానించారు. గత 12ఏళ్ళుగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితమే ఈనాటి అనిశ్చిత పరిస్థితుల్లో కూడా నిలకడగల వృద్ధిని, ఆర్థిక సుస్థిరతను సాధించగలిగామని నిర్మలమ్మ చెప్పుకున్నారు. అయితే ఈ లెక్కలు దేనిని బేరీజు వేసుకుని చెప్పారన్నది అర్థం కావడం లేదు. గ్రామాలకు వెళితే ప్రజల జీవన పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుస్తాయి. వారికి ఇంకా ఉచిత బియ్యం అందిస్తున్నామంటే, వారి అర్థిక పరిస్థితిని గమనించవచ్చు. రైతులు ధాన్యం పండిస్తున్నా గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. తిండి గింజలు కొనుక్కోలేక సామాన్యులు విలవిల్లాడుతున్నారు. అయితే కేన్సర్ పేషెంట్లకు ఊరట కలిగించేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. కేన్సర్ చికిత్స కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే అత్యావశ్యక ఔషధాలపై దిగుమతి సుంకాన్ని మినహాయిస్తారు. దీనిలో భాగంగా 17 రకాల ఔషధాలు ధరలు తగ్గుతాయి. అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మరో ఏడు కీలక ఔషధాలపై కూడా దిగుమతి సుంకాలు తగ్గుతాయి. కేన్సర్ చికిత్సలో వాడే మందులు, ఇతర ఔషధాలు, ఆహార పదార్థాలు, పరికరాలపై కూడా సుంకాలు తగ్గుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఆకళింపు చేసుకోకుండా ఎన్ని బడ్జెట్లు ప్రవేశ పెట్టినా భారత పురోగతి కాగితాలకే పరిమితం అవుతుంది.

## ఇంటిపై దాడి ఏ విధమైన రాజకీయం

### డిప్యూటి సిఎం పవన్‌కు అంబటి తనయ సూటి ప్రశ్న

**గుంటూరు,ఫిబ్రవరి2 :** ఆడవాళ్ల గురించి మాట్లాడుతున్న డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, తాము ఇంట్లో ఉన్న సమయంలో తమపై జరిగిన దాడి గురించి ఎందుకు మాట్లాడడం లేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు కుమార్తె మౌనిక ప్రశ్నించారు. ఆడవాళ్లు అని కూడా చూడకుండా తమ ఇటిపై దాడి చేసి దౌర్జన్యానికి దిగారని, ఇదెక్కడి రాజకయీమని ఆమె ప్రశ్నించారు. ఇటీవల తన ఇంటిపై జరిగిన దాడి ఘటనపై తీవ్రంగా మండిపడింది. మీడియాతో ఆమె మాట్లాడుతూ.. ఈ దాడి పక్కా పథకం ప్రకారమే జరిగిందని, టీడీపీ కార్యకర్తలు ప్రీ-ప్లాన్ చేసి వ్యూహాత్మకంగా దాడికి పాల్పడ్డారని ఆమె ఆరోపించారు.ఎమ్మెల్యే గల్లా మాధవి ఈ దాడికి ముందే రెచ్చగొట్టి ప్రేరేపించారని, రెచ్చగొట్టిన వీడియోలు కూడా ఉందని చెప్పారు. అలాగే కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తనపై దాడికి ముందు సినిమా చూపిస్తామని హెచ్చరించినారని ఆమె అన్నారు. అలాగే తన వ్యాఖ్యలు అసభ్యంగా మాట్లాడిన వాళ్లను ఉద్దేశించి చేసినవనీ, సీఎం చంద్రబాబును కాదనీ తన తండ్రి వివరణ ఇచ్చిన తరవాత కూడా దాడి చేశారని అన్నారు. తమ ఇంటిపై జరిగిన దాడి ఘటన నైతిక విలువలకు విరుద్ధం అన్నారు. ఈ ఘటనపై హోంమంత్రి అనిత స్పందించాలనీ.. ఎందుకంటే మహిళల భద్రత రాష్ట్రంలో సరియైన స్థాయిలో లేదన్నారు. రాష్ట్ర పోలీసులు దాడిని నియంత్రించడంలో విఫలమయ్యారన్నారు. దాడికి పాల్పడినవారు తన కుటుంబాన్ని, భద్రతను పరిగణనలోకి తీసుకోకుండా, నిందితులను ప్రోత్సహించారనీ ఆమె తెలిపారు. ఈ దాడిని ఇలాంటి నీచ రాజకీయాలు, మహిళల భద్రతను ఉల్లంఘించే చర్యలు నేనెప్పుడూ చూడలేదని.. ఈ ఘటనపై ఫిర్యాదు చేస్తామన్నారు.

## బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హదరాబాద్

### బుల్లెట్ ట్రైన్ల కేటాయిపులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2 :** బుల్లెట్ ట్రైన్‌కు హైదరాబాద్ మహా నగరం హబ్‌గా మారుతుందని రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన రైల్వే ప్రాజెక్టులతోపాటు నిధుల కేటాయింపులనువివరించారు. సోమవారం న్యూఢిల్లీలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,454 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. అలాగే మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు ఇచ్చామని చెప్పారు. అవి.. హైదరాబాద్ - బెంగళూరు (రెండున్నర గంటల ప్రయాణం..) , హైదరాబాద్ - చెన్నై (2:55 గంటల ప్రయాణం..), హైదరాబాద్ - పుణె (1:45 గంటల ప్రయాణం..) అంటూ సోదాహరణగా వివరించారు. కేంద్ర బ్జడెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌కు సమర్పించారు. ఈ బడ్జెట్‌లో కేటాయింపును ఆయన వివరించారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లు అన్నీ ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మిస్తామన్నారు. అందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇది సౌత్ ఇండియా డైమండ్ హై స్పీడ్ రైల్వే ప్రాజెక్ట్ అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కంటే అధికంగా తెలంగాణ రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించామని ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అయినా 2026-27 బడ్జెట్‌లో కేంద్రం మొండి చేయి చూపిందంటూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని పలువురు అగ్రనేతలు ఆరోపిస్తున్నారు. అలాంటి వేళ రైల్వే శాఖ ద్వారా తెలంగాణకు జరిగిన బ్జడెట్ కేటాయింపులను ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోదాహరణగా వివరించారు.

# మేడారం జాతర విజయవంతం

### ఊహించిన దానికన్నా పెరిగిన భక్తుల రాక

### మంత్రి సీతక్క వెల్లడి

**ములుగు,ఫిబ్రవరి2 :** మేడారం సమక్క - సారక్క అమ్మవార్ల మహాజాతర విజయవంతం అయిందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. భక్తులకు చిన్న చిన్న అసౌకర్యాలు కలిగినందుకు చింతిస్తున్నామన్నారు. వీవీఐపీల తాకిడి వల్లే ట్రాఫిక్ జామ్ అయిందని చెప్పుకొచ్చారు. సమ్మక్క - సారలమ్మ అమ్మవార్లతో తమకు భావోద్వేగ బంధం ఉందని మంత్రి సీతక్క ప్రస్తావించారు. అందుకే అన్ని జాగ్రత్తలు చేపట్టామని వివరించారు. జాతరకు వెళ్తే ఏదో జరుగుతుందని ఓ వర్గం ప్రచారం చేసిందని తెలిపారు. జాతరను తక్కువచేసి చూపాలన్న కుటిల ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. అయినప్పటికీ జాతరకు జనం తండోపతండాలుగా తరలివచ్చారని చెప్పుకొచ్చారు. మహాజాతర అనంతరం తాను పారిపోయినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేశారన్ని ÷ర్ అయ్యారు. తాను పారిపోయేరకం కాదని.. ప్రజల కోసం పంతం నెగ్గించుకునే వ్యక్తినని స్పష్టం చేశారామె. ఆదివాసీల అస్తిత్వం కోసం పరితపించే బిడ్డనని చెప్పారు.

# జోగిరమేశ్, అంబటిలపై దాడి ఏ రకమైనా ప్రజాస్వామ్యం

### గుండాలకు అండగా పోలీసులు నిలబడం దారుణం

### జోగి రమేశ్ ఇంటిని పరిశీలించిన సజ్జల

విజయవాడ,ఫిబ్రవరి2 : మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి ఘటనలో టీడీపీ గూండాలకు పోలీసులకు రక్షణగా నిలిచారని వైఎస్సార్‌సీపీ సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదుగంటల పాటు పోలీసుల సమక్షంలో అరాచకం రాజ్యమేలిందని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్నంలోని మాజీ మంత్రి జోగి రమేష్ నివాసంపై టీడీపీ గూండాల దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడిపై పరామర్శించేందుకు జోగి రమేష్ ఇంటికి సజ్జలతో పాటు ఇతర వైఎస్సార్‌సీపీ నేతలు వెళ్లారు. దాడికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదు. గుంటూరు పోలీసుల సమక్షంలో అంబటి రాంబాబు ఇంటిపై దాడులు చేశారు. గుంటూరులో టీడీపీ గూండాలు ఏం చేశారో రాష్ట్రప్రజలు చూశారు. టీడీపీ గూండాలకు పోలీసులు రక్షణగా ఉన్నారు. అంబటిని కలిసేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు యత్నించారు. అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లిన పార్టీ నేతల్ని అడ్డుకున్నారు. మాజీ హోంమంత్రి ఫోన్ చేసినా పోలీసులు స్పందించలేదు. బాధితుడినే పోలీసులు అరెస్టు చేశారు. మా నేతలను ఎస్పీ కార్యాలయంలో ఎదుట గంట సేపు ఎదురు చూయించారు. ప్లాన్ ప్రకారం అంబటి రాంబాబు,జోగి రమేష్ కుటుంబ సభ్యులపై దాడి జరిగింది. టీడీపీ గూండాలను పోలీసులు కంట్రోల్ చేస్తున్నట్లు యాక్ట్ చేశారు. జోగి రమేష్ కుటుంబానికి ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని సజ్జల ప్రశ్నించారు. బటి,జోగి రమేష్ ఇళ్లపై దాడులు చేసిన గూండాలపై కేసులు పెట్టలేదు. దాడి ఘటనపై పోలీసులు విచారణ చేపట్టలేదు. కూటమి నేతల అరాచకాల్ని ఎదుర్కొంటాం. కూటమి అరాచకాల్ని జాతీయ స్థాయికి తీసుకెళ్తాం. చంద్రబాబు వైఎస్సార్‌సీపీ శ్రేణులు,నేతల్ని బెదిరింపులు, దాడులు చేసి బెదిరించాలని అనుకోవద్దు. అలా అనుకుంటే భ్రమే అవుతుంది'అని వ్యాఖ్యానించారు.

------------------

# రాహుల్‌ను అడ్డుకోవడం సరికాదు

### చెప్పాల్సిన విషయం చెప్పకుండా పోయింది

### లోక్‌సభలో ప్రభుత్వ తీరును తప్పపట్టిన శశిథరూర్



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2: రాహుల్ గాంధీ లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై అధికార పక్షం అతిగా స్పందించిందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణెళి రాసిన పుస్తకం లోని విషయాలతో వచ్చిన ఒక ఆర్టికల్‌ను రాహుల్ తన ప్రసంగంలో ప్రస్తావిస్తుండగా అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం తలెత్తి సభ వాయిదా పడింది. అనంతరం మీడియా సమావేశంలో రాహుల్‌కు బాసటగా శశిథరూర్ స్పందించారు. తన ఆందోళనను బయటపెట్టే అవకాశం ఆయనకు ఎప్పుడూ రాలేదు' అని శశిథరూర్ పేర్కొన్నారు. ఆ కథనం బలగాలను కానీ సైనికులను కానీ తప్పుపట్టలేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న, తీసుకోకుండా పోయిన కొన్ని అంశాలను మాత్రమే రాహుల్ గాంధీ ప్రస్తావించాలనుకున్నారని, దానికి ప్రభుత్వం అంత అతిగా స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. రాహుల్ లేవనెత్తాలనుకున్న అంశం గురించి ప్రజలకు తెలిసిందేనని, ఆయన ఓ మ్యాగజైన్‌లో ప్రచురితమైన కథనంగా ఆధారంగానే మాట్లాడారని వివరించారు. ఆ పుస్తకం ప్రచురితం కాలేదని ప్రభుత్వం అభ్యంతరం చెప్పడానికి బదులుగా ఆయనకు మాట్లాడే అవకాశం ఇచ్చి ఉండాల్సి ఉందని శశిథరూర్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అతిగా స్పందించాల్సిన అవసరం లేదు. అది సభ వాయిదాకు దారితీసింది. చర్చ కొనసాగించి ఉంటే పార్లమెంటులో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రతిబింబించి ఉండేది. నిజాలు తప్పయితే నిజాలను సవరించాలి. కానీ నిజాలను ప్రసారం కాకుండా అడ్డుకోకూడదు' అని శశిథరూర్ వ్యాఖ్యానించారు. పండిట్ జవహర్‌లా నెహ్రూ హయాంలో పార్లమెంటులో జరిగిన కీలక చర్చను ఈ సందర్భంగా శశిథరూర్ ప్రస్తావించారు. 1962లో చైనా-భారత్ యుద్ధం జరుగుతుండగా పార్లమెంటు సమావేశమైందని, ఒకవైపు యుద్ధం జరుగుతుండగా చర్చలను పొడిగించి మరీ నిర్వహించారని చెప్పారు. 'అప్పుడు ఎలాంటి విప్‌లు లేవు. ప్రభుత్వ ఎంపీలు సైతం ప్రభుత్వాన్ని, ప్రధానమంత్రి నెహ్రూను సైతం విమర్శించగలిగే వారు' అని తెలిపారు. 1965, 1971 యుద్ధాల సమయంలోనూ పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి ఆ వివరాలను ఎంపీలతో పంచుకోవడం, దేశ ప్రజలను పరిగణనలోకి తీసుకోవడం జరిగిందని ఆయన వివరించారు.

## దాడులు చేయడమే రూల్ ఆఫ్ లా నా?

### అంబటి, జోగి ఇళ్లపై దాడికి సమాధానం చెప్పాలి

### టిడిపి ప్రభుత్వ తీరుపై మండిపడ్డ రోజా

చిత్తూరు,ఫిబ్రవరి2 : అధికారం చేతుల్లో ఉందని అరాచకాలకు తెలుగుదేశం పార్టీ పాల్పడుతోందని మాజమంత్రి ఆర్ కె రోజా మండిపడ్డారు. ఇదేనా ప్రజాస్వమా÷-యం గురించి మాట్లాడే తీరు అంటూ నిలదీసారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని వరుస దాడులకు పాల్పడుతోంది. డైవర్షన్ రాజకీయాల్లో భాగంగానే ఈ దాడులని వైఎస్సార్‌సీపీ నేత ఆగ్రహం వ్యక్తం చేసారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక.. వైఎస్సార్‌సీపీ నేతలపై, ఆఫీస్‌లపై జరిగిన దాడులను నగరి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రస్తావించారు. తాజాగా జరిగిన అంబటి రాంబాబు, జోగిరమేష్ ఇళ్లపై దాడులను ప్రముఖంగా ప్రస్తావిస్తూ.. గతంలో వలభనేని వంశీ, కొడాలి నాని, పేర్ని నాని, సీనియర్ నేత ముద్రగడ, అలాగే మరో సీనియర్ నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, చిత్తూరు రెడ్డప్ప నివాసాలపై జరిగిన దాడుల్ని ప్రస్తావించారు.. కామిరెడ్డి నాని, కేతిరెడ్డి పెద్దారెడ్డి, అబ్బయ్య చౌదరి, భూమన కరుణాకర్ రెడ్డి ఇంటిపై కూటమి పార్టీల శ్రేణులు దాడి చేశాయని గుర్తుచేశారు. దాడిశెట్టి రాజా, ఉప్పల హారికా-ఉప్పల రాము, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడితో పాటు విడదల రజిని.. దేవినేని అవినాష్ పై దాడికి యత్నించారని రోజా అన్నారు. మార్గాని భరత్ ఆఫీస్‌పై, నంబూరి శంకర్రావు ఆఫీసుపై, హిందూపుర్ వైసీపీ ఆఫీస్‌లపై దాడి ఘటనలను ప్రముఖంగా ప్రస్తావించారు. వీటన్నింటితో పాటు తనపైనా ఆర్పీని(జబర్దస్త్ కిర్రాక్ ఆర్పీ) పెట్టి బూతుల తిట్టించారని అన్నారామె. డెక్కన్ క్రానికల్, సాక్షి ఆఫీసులపై టీడీపీ అండ్ కో పార్టీలు దాడులు చేశాయని.. చంద్రబాబు చెబుతున్న రూల్ ఆఫ్ లా అంటే ఇదేనా? అని రోజా ప్రశ్నించారు.

## చెట్టును బలంగా ఢీకొన్న టూవీలర్

### ఇద్దరి ప్రాణాలను మింగిన అతివేగం

తిరుపతి,ఫిబ్రవరి2 : తిరుపతి జిల్లా నాగలాపురం మండలం కృష్ణాపురం వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. చెన్నై నుంచి తిరుపతికి వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్తున్న ఇద్దరు యువకులు ప్రమాదానికి గురయ్యారు. కృష్ణాపురం వద్ద ఉన్న ప్రమాదకరమైన మలుపులో వేగంగా వస్తున్న బైక్.. ఒక్కసారిగా అదుపుతప్పి హైవే పక్కనే ఉన్న చింత చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు తల భాగంలో తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## చీరల గురించి కాదు..బడ్జెట్‌పై చర్చించండి

### సోషల్ మీడియా వార్తలపై నిర్మలమ్మ అసహనం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి2 : ఏటా బడ్జెట్ వేళ ఆర్థిక కేటాయింపుల పైనే కాకుండా.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధరించే చీరల పైనా అందరి దృష్టి ఉంటుంది. ఎందుకంటే ఆమె చేనేతకు సంబంధించిన ప్రత్యేకించిన చీరలను ధరిస్తారు. అలాగే ఎంతో హుందాగా దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ఏటా ఆమె ధరించే చీరలపై చర్చ సాగుతూనే ఉంటుంది. దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా ఆమె ఎంచుకునే చీరల పైనా చర్చలు జరుగుతాయి. ప్రతి ఏడాది బడ్జెట్ సమయంలో తన చీరలపై జరుగుతోన్న చర్చలపై ఆర్థికమంత్రి అసహనం వ్యక్తంచేశారు. ప్రతి సంవత్సరం బడ్జెట్రోజు నేను ఏం ధరించబోతున్నా ననే ప్రశ్నలు నాకు ఒత్తిడిగా మారుతున్నాయన్నారు. 'ఎందుకు ఇలా ప్రశ్నలతో వేధిస్తున్నారు? ఒకవేళ బ్జడెట్ ప్రవేశపెట్టేది పురుష మంత్రులైతే వారిని కూడా ఇలాగే వారి దుస్తుల గురించి అడిగేవారా? నేను ధరించే చీరను కూడా బ్జడెట్‌లో ఒక అంశంలా మార్చేస్తున్నారు' అంటూ సీతారామన్ అసహనం వ్యక్తంచేశారు.బడ్జెట్లో ఉన్న అంశాలు ఏమిటి అనే విషయాలను తెలుసుకోవడంపై ప్రజలు దృష్టి పెట్టాలని.. తన చీరలపై కాదని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి అనవసర విషయాల గురించి ఆలోచించడం వల్ల ముఖ్యమైన విషయాలపై పట్టు కోల్పోతామన్నారు. కాగా ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేళ ఆమె కాంచీపురం చీరలో కన్పించారు. బంగారు, కాఫీ వర్ణం అంచుతో ఉన్న మెజెంటా రంగు చీర, గోల్డెన్ కలర్ బ్లౌజ్, శాలువాతో కన్పించారు. అది తమిళనాడు నేపథ్యం ఉన్న చీర. కొన్ని నెలల్లో ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఆమె కాంచీపురం చీరను ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై నెట్టింట చర్చ జరుగుతోన్న సమయంలో నిర్మలా సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం

## బలూచీ ఆత్మాహుతి దాడిలో 50మది మృతి

### ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లు పాల్గొన్నట్లు గుర్తింపు

ఇస్లామాబాద్,ఫిబ్రవరి2 : పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్సులో నరమేధం కొనసాగుతోంది. పాక్ సైన్యం చేపట్టిన ఆపరేషన్‌కు వ్యతిరేకంగా ఆత్మహుతి దాడులు సాగుతున్నాయి. దీంతో ఇప్పటికే వందల్లో మృతి చెందారు. బలూచిలోని 12 వేర్వేరు ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతోన్న దాడులకు బాధ్యత వహిస్తూ.. బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటన వెలువరించింది. పాక్ దళాలపై దాడి చేసింది తమ విభాగానికి చెందిన ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లేనని వెల్లడించింది. వీరిలో 24 ఏళ్ల ఆసిఫా మెంగల్ అనే యువతి చేసిన దాడిలో పాక్ సిబ్బంది సహా 50 మంది మృతి చెందినట్లు తెలిపింది. మరో ఆత్మాహుతి బాంబర్ దాడిలోనూ అనేకమంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. అయితే ఆ బాంబర్ పేరును మాత్రం వెల్లడించలేదు. బలోచిస్థాన్ అంతటా భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని 'హీరోఫ్' పేరుతో రెండో దశ ఆపరేషన్‌ను ప్రారంభించనున్నట్లు బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఆదివారం పేర్కొంది. ఈ విషయంపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. ఆత్మాహుతి దాడుల్లో ఇద్దరు మహిళా నేరస్థులు పాల్గొన్నట్లు గుర్తించామన్నారు. ఈ దాడులపై బలోచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగతీ స్పందించారు. పాకిస్థాన్ భద్రతా దళాలు 40 గంటలుగా ఉగ్రవాద ఏరివేత చర్యలు కొనసాగిస్తున్నాయని.. ఇందులోభాగంగా ఇప్పటివరకు 140 మందికి పైగా వేర్పాటువాదులను మట్టుబెట్టాయని వెల్లడించారు. స్థానిక పౌరుల వేషధారణలో ఉన్న బలోచ్ రెబల్స్ పాఠశాలలు, బ్యాంకులు, మార్కెట్లు, ఆసుపత్రులలోకి ప్రవేశించి కాల్పులకు తెగబడుతున్నారని పాక్ మిలిటరీ తెలిపింది. ఏదైనా నగరం లేదా వ్యూహాత్మక స్థావరాన్ని స్వాధీనం చేసుకోవడానికి బలోచ్ రెబల్స్ ప్రయత్నాలు చేస్తున్నాయని.. అయితే వాటిని తమ దళాలు సమర్థవంతంగా తిప్పికొడుతున్నాయని పేర్కొంది.

## ఆదోని గ్రానైట్ ఫ్యాక్టరీలో ఘోరం

### గ్రానైట్ బండ తగిలి కార్మికుడు మృతి

కర్నూలు,ఫిబ్రవరి2(ఆర్ఎన్ఎ):కర్నూలు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఆదోని డివిజన్ కపటి గ్రామ శివారులోని ఒక గ్రానైట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదం.. ఓ వలస కూలీ ప్రాణాన్ని బలిగొంది. గ్రానైట్ ఫ్యాక్టరీలో పనులు జరుగుతున్న సమయంలో అనుకోని రీతిలో ఈ ఘటన చోటుచేసుకుంది.ఫ్యాక్టరీలో గ్రానైట్ రాళ్లను ప్రాసెస్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ భారీ రాతి బండ ఒక్కసారిగా ఎగిరి కార్మికుడిపై పడింది. బండరాయి బలంగా తగలడంతో ఆ కార్మికుడు తీవ్ర గాయాలపాలై ఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలాడు. మృతిచెందిన కార్మికుడిని రాజమాల్‌గా గుర్తించారు. ఆయన ఉపాధి కోసం పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన వలస కార్మికుడని సహచర కార్మికులు తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఆదోని రూరల్ పోలీసులు.. తక్షణమే ఫ్యాక్టరీకి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఫ్యాక్టరీలో రక్షణ చర్యలు లోపించాయా లేదా అనే కోణంలో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఈ సమాచారాన్ని అందించారు. ఫ్యాక్టరీలు, మైనింగ్ ప్రాంతాల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రాణాలు పోతున్నాయని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

## 8న కృష్ణానదిలో...కృష్ణాతీరం కవితాహారం


విజయవాడ,ఫిబ్రవరి2(ఆర్ఎన్ఎ):తెలుగు సాహిత్యాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు, నేటితరం సాహిత్యాన్ని రికార్డు చేసి ముందుతరాలకు దాచి వుంచేందుకు మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ-ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సహకారంతో ఫిబ్రవరి 8న ఆదివారం కష్ణానదిలో బోధిసిరి పడవపై వినూత్నంగా 'కృష్ణాతీరం- కవితాహారం' కవి సమ్మేళనం నిర్వహిస్తోంది. లబ్ద ప్రతిష్టులైన నాటితరం కవులతోపాటు నేటితరం కవుల నుండి ఎంపిక చేసుకున్న 50 మంది కవులు ఈ కవి సమ్మేళనంలో తమ కవితల్ని వినిపిస్తారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు మొదలై సాయంత్రం 4 గంటలకు ముగుస్తుంది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఆంధ్రప్రదేశ్ సజనాత్మకత, సంస్కృతి సమితి సంచాలకులు రేగుళ్ళ మల్లికార్జునరావు, పర్యాటక శాఖ అధికారులు

# యూపి సిఎం యోగి సంచలన నిర్ణయం

### ఉద్యోగుల స్థిరచరాస్తుల వివరాలు సమర్పించాలని ఆదేశం

**లక్నో,ఫిబ్రవరి 2** : ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆధిత్యనాథ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగుల స్థిర,చర ఆస్తులు అంటే ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించే వాహనాలు ఇతర ఆస్తులతో స్థిరాస్తులైన ఇళ్లు, స్థలాల వివరాలను అందించాలని సూచించారు. ఇందుకోసం మానవ్ సంపద పేరుతో ఓ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 8,66,261 ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. డిసెంబర్ 31,2025 నుంచి జనవరి 31,2026 వరకు వారి ఆస్తుల వివరాల్ని పోర్టల్‌లో పొందుపరచాలని ఆదేశించారు. నిర్ధేశించిన గడువు లోపు ఆస్తుల వివరాలు అందించాలని, లేదంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చీఫ్ సెక్రటరీ ఎస్పీ గోయల్ పర్యవేక్షించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం యోగి ఆధిత్యనాథ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు తమ తమ ఆస్తులు ఇవేనంటూ సంబంధిత ఆస్తుల వివరాల్ని మానవ్ సంపద్ పోర్టల్‌లో ఆధాలతో సహా అప్‌లోడ్ చేశారు. వారిలో 68వేల మంది ఉద్యోగులు వారి వివరాల్ని ఇవ్వలేదు. ఉద్యోగుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన యూపీ సీఎం వారి జనవరి జీతాల్ని నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల ఆస్తుల వివరాలు ఇచ్చే వరకు జీతాలు ఇవ్వకూడదని సంబంధిత శాఖ అధికారులకు స్పష్టం చేశారు. అంతేకాదు, ప్రమోషన్ల నిలిపివేయడం, వారిపై పెనాల్టీ విధిస్తామని హుకుం జారీ చేశారు.

# అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికహర పదార్థాల పంపిణీ.



**పెగడపల్లి, ఫిబ్రవరి 02 ( చట్టం న్యూస్):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని వెంగళాయిపేట గ్రామ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార పదార్థాల పంపిణీ నిర్వహించారు. పిల్లలకు కోడిగుడ్లు, బాలమృతము, పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ మోకెనాపెల్లి గోపాల్, మాట్లాడుతు పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుతూ పౌష్టికాహారం పై గ్రామ ప్రజలకు అవగాహన పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోకెనపెల్లి గోపాల్, ఉపసర్పంచ్ కుంచె రాజేందర్, కార్యదర్శి కిరణ్ బాబు, కారోబారి మల్లయ్య, అంగన్వాడీ టీచర్ ఆరేపల్లి సుగుణ, ఆయా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# క్రీడల పట్ల యువతను ప్రోత్సహిస్తున్న జానీ పాషా.





**పెగడపల్లి, ఫిబ్రవరి 01 ( చట్టం న్యూస్):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని అయితుపల్లి గ్రామంలో యువతను క్రీడల పట్ల ప్రోత్సహిస్తున్న మొహమ్మద్ జానీ పాషా, గ్రామ యూత్ సభ్యులు క్రికెట్ బ్యాట్ కావాలని అడిగిన వెంటనే ఐతిపల్లి ఎక్స్ కో ఆప్షన్ సభ్యులు మొహమ్మద్ జానీ పాషా, సీనియర్ క్రికెట్ ప్లేయర్ వెంటనే ఆన్లైన్ ద్వారా క్రికెట్ బ్యాట్ బుక్ చేసి యూత్ కు బ్యాట్ అందించారు.
ప్రతిసారి క్రీడల పట్ల యువత ను ప్రోత్సహిస్తూ మంచి మనసును చాటుకున్నారు. మొహమ్మద్ జానీ పాషా కు మన ఊరు యువత ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, యువత పాల్గొన్నారు.

## ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడిగా.. గుడి మనోజ్ రెడ్డి.....



ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 2 ,( చట్టం బ్యూరో )
అన్న పూర్ణ ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో బోయినపల్లి మండలం తడగొండలో నూతనంగా కార్యవర్గ సభ్యులని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు గా గుడి మనోజ్ రెడ్డి, ఉపఅధ్యక్షులు చేపూరి కనుకయ్య ,గోగురి తిరుపతి రెడ్డి, ఆముదాల లక్ష్మారెడ్డి, క్యాషియర్ భూమల్ల మహేష్ . ప్రధానకార్యదర్శిగా భీమ తిరుపతి., కార్యవర్గ సభ్యులు ఎస్.కె షాదుల్లా, పిట్టల మల్లేశం ను ట్రాక్టర్ యూనియన్ సభ్యులు ఎకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మాజీ అధ్యక్షులు రేండ్ల గంగరాజు ను శాలువాతో సత్కరించి నూతన సభ్యులకు బాధ్యతలు అప్పగించారు.

# ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రజావాణి / గ్రీవెన్స్ డే ..

**సంగారెడ్డి జిల్లా బ్యూరో చట్టం న్యూస్**
ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించిన అదనపు ఎస్పీ..లి
సమస్యల పరిష్కారానికి ఎస్.హెచ్.ఓలకు ఫోన్ ద్వారా స్పష్టమైన ఆదేశాలు: అదనపు ఎస్పీ రఘునందన్ రావ్
సంగారెడ్డి జిల్లా సురక్ష ప్రతినిధి: ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అదనపు ఎస్పీ రఘునందన్ రావ్ తెలిపారు.
ఈ సందర్భంగా సమస్యలతో జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి




స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. ఫిర్యాదులకు సంబంధించిన అంశాలపై సంబంధిత ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకుని, ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు పూర్తి న్యాయం చేకూర్చాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.
జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలకు పరిష్కారం లభించని సందర్భాల్లో ఎలాంటి భయాలు లేదా ఒత్తిళ్లకు లోనుకాకుండా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, త్వరితగతిన పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

# తెలుగు రాష్ట్రాల్లో పులి సంచారం కలకలం

- **కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ప్రచారం**
- **తొర్రేడులో పులిజాడతో ప్రజల భయాందోళన**
- **అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారుల హెచ్చరిక**
- **పులిని పట్టుకునేందుకు బోను, సిసి కెమెరాల ఏర్పాటు**

**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 2**
రాజమహేంద్రవరం మండలంలోని తొర్రేడులో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. పెద్దపులి దాడిలో మృతి చెందిన రెండు ఆవులు, దూడ కళేబరాలను వారు గుర్తించారు. పెద్దపులిని పట్టుకునేందుకు తొర్రేడు తోటల్లో పులిబోను, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ, సీతానగరం మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు డీఈవో సోమవారం సెలవు ప్రకటించారు. పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలోని ప్రజల్ని, పర్యాటకుల్ని అధికారులు అప్రమత్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రెండు పెద్ద పులులు జనారణ్యంలోకి వచ్చినట్టు అటవీ అధికారులు భావిస్తున్నారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పులుల సంచారం కలకలం రేపుతున్నాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పులుల సంచారం ఎక్కువైపోయింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుంచి తెలుగు రాష్ట్రాల్లోకి వచ్చిన పులులు అలజడి సృష్టిస్తున్నాయి. మొన్నటి వరకు ఏలూరు జిల్లా ఏజెన్సీని వణికించిన పెద్దపులి ఇప్పుడు తూర్పు గోదావరిలోకి ప్రవేశించింది. నిన్న రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడులో పశువులపై దాడి చేసి చంపేసింది. పులి దాడిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు మీడియా సమావేశం నిర్వహిస్తుండగా.. వారి వెనకాలే పులి కనిపించింది. పులి సంచారం నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు రాజమండ్రి రూరల్, కోరుకుంట్ల, సీతానగరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. పిల్లల్ని బయటకు వెళ్లనీయకుండా జాగ్రత్త తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించింది. ఇక నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నందిపాడులోనూ పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. రేమానుకుంట వద్ద స్థానికులకు పెద్దపులి కనిపించింది. దీంతో ఉదయగిరి పరిసర ప్రాంతాలవారు భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పెద్దపులి సంచారం.. జనాలతో పాటు ఫారెస్ట్ అధికారుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. 15 రోజులుగా ఫారెస్ట్ అధికారులు పెద్దపులిని పట్టుకోవటానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ లాభం లేకుండా పోయింది. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి ఆ పెద్దపులి వచ్చినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఈ పెద్దపులి యాదాద్రి భువనగిరితో పాటు సిద్ధిపేట జిల్లా సరిహద్దులోనూ సంచరిస్తోంది. ఇక హైదరాబాద్ శివారు ప్రాంతంలోనూ ఓ పెద్దపులి తిరుగుతున్నట్లు సమాచారం.

# వైకాపా గుర్తింపు రద్ద చేయాల్సిందే

### ఎన్నికల సంఘానికి లేఖ రాస్తానన్న గంటా

**విశాఖపట్నం,ఫిబ్రవరి2 :** భవిష్యత్ తరాలు ఆందోళన చెందేలా వైకాపా నేతలు వ్యవహరిస్తున్నారని టిడిపి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. ఆ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రులు అంబటి రాంబాబు అసభ్య వ్యాఖ్యల నేపథ్యంలో విశాఖలో గంటా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్‌తో పాటు వైకాపా నేతలు అంబటి రాంబాబు, కొడాలి నాని, పేర్ని నాని, జోగి రమేశ్, రోజా చేసిన మురికి వ్యాఖ్యల వీడియోలను ఆయన ప్రదర్శించారు. నాలుగు సార్లు సీఎంగా ఉన్న చంద్రబాబును ఉద్దేశించి ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజల్లో ఆగ్రహం ఉంటుందని గంటా శ్రీనివాసరావు అన్నారు. వైకాపా హయాంలో ఆయన్ను విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో ఘోరంగా అడ్డుకున్నారని చెప్పారు. ఉనికిని కాపాడుకునేందుకు ఆ పార్టీ యత్నిస్తోందని.. పైగా కులాలను ఆపాదిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. అసెంబ్లీలో వైఎస్ఆర్ సైతం క్షమాపణ చెప్పిన ఘటనలు చూశామన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విస్తృత బందోబస్తు

### పట్టణ పరిధిలో పలు గ్రామాల్లో విస్తృత తనిఖీలు

మేడ్చెల్,ఫిబ్రవరి2 : రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. యెల్లంపేట్, రావల్కోల్, రాజబొల్లారం తండా మున్సిపాలిటీ పరిధిలో విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. ఇందులో భాగంగా మేడ్చల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, దుండిగల్ పోలీస్ సిబ్బంది, జోనల్ ఫోర్స్‌తో కలిసి రావల్కోల్ గ్రామ పరిధిలో వాహనాల తనిఖీలు, ఫుట్ ప్యాట్రోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామని పేర్కొన్నారు.ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు విజిబుల్ పోలిసింగ్ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# సన్నాహక సమావేశం లో పాల్గొన్న కొండా సురేఖ పొంగు లేటి తుంబూరు



ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 2 సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల సన్నాక సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ మరియు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయం ఇంచార్జీ తుంబురు దయాకర్ రెడ్డి ,రాయల నాగేశ్వరరావు , నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పాల్గొన్నారు ఇతర జిల్లా నాయకులు పాల్గొన్నారు

# ప్రభుత్వంతో కలసి పనిచేస్తే మంచిది

### రాజ్యసభలో బిజెపి ఎంపి సదానందన్ మాస్టర్
### తన కృత్రి కాళ్ల నిరసన ఘటనపై సభలో వెల్లడి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2 : ఏదైనా విషయంలో కేంద్రాన్ని గుడ్డిగా వ్యతిరేకించొద్దని భాజపా ఎంపీ సి.సదానందన్ మాస్టర్ ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన రాజ్యసభలో ఈమేరకు తొలి ప్రసంగం చేశారు. ఈ క్రమంలోనే తన రెండు కృత్రిమ కాళ్లను తీసి టేబుల్‌పై పెట్టి.. విపక్షాలను నిలదీయడం చర్చనీయాంశమైంది. ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న వారే.. 31 ఏళ్ల క్రితం కేరళలో నాపై దాడి చేశారు. ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో.. కొంతమంది పథకం ప్రకారం రోడ్డుపై నన్ను వెనుక నుంచి పట్టుకుని, నా కాళ్లను నరికేశారని సదానందన్ మాస్టర్ రాజ్యసభకు వివరించారు. అయితే, కృత్రిమ కాళ్లను ప్రదర్శించడాన్ని సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్ తప్పుపట్టారు. ఇది నిబంధనల ఉల్లంఘనేనని 'పాయింట్ ఆఫ్ ఆర్డర్' లేవనెత్తారు. ఈ క్రమంలోనే బ్రిటాస్‌కు సదానందన్ బదులిస్తూ.. ప్రజాస్వామ్యం అంటే ఏంటో దేశానికి, ప్రజలకు చూపించాలనుకుంటున్నాను. మీరు ఎప్పుడూ ప్రజాస్వామ్యం, సహనం, మానవత్వం గురించి మాట్లాడుతుంటారు. కానీ, మీ నిబద్ధత రాజకీయ హింసపై ఆధారపడి ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు. అనంతరం ఆ కృత్రిమ కాళ్లను టేబుల్‌పై నుంచి తొలగించారు.

# మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

### ఎన్నికల ప్రచారంలో గంజి జయమ్మ గణేష్

**భూదాన్ పోచంపల్లి ; ఫిబ్రవరి 2 (చట్టం ప్రతినిధి) :** మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో 6వ ,వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గంజి జయమ్మ గణేష్ 6 వ వార్డు లోని ప్రతి సమస్యలను తన సమస్యగా తీసుకొని అభివృద్ధి లక్ష్యంగా ప్రజలకు అండగా ఉంటానని ఎన్నికల ప్రచారం నిర్వహించారు . కార్యక్రమంలో పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ , తాటి నరసింహా , కుడికాల బిక్షపతి , చిక్క అశోక్ , వలందాస్ ప్రవీణ్ , దేవతల సతీష్ , అమృతం బాలయ్య , వలందాస్ నవీన్ , తడక వెంకటేష్ , ఎంబ లక్ష్మి , ఆటిపాముల విజయలక్ష్మి , చిక్క రూప ,తదితరులు పాల్గొన్నారు .

# చిరుత దాడిలో గాయపడిన వారిని పరామర్శించిన, సింగనమల శాసనసభ్యురాలు బండారు శ్రావణి






**నార్పల, ఫిబ్రవరి 2 ,(చట్టం) న్యూస్ :** నార్పల మండలం బొందలవాడ గ్రామంలో నారాయణస్వామి, లక్ష్మీదేవి, వెంకట నాయుడులపై చిరుత దాడి చేసింది. చిరుత పులి సంచారం సంచరిస్తుండంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యవసాయ పొలాలు అటవీ ప్రాంతాల పరిసరాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. చిరుత పులిని పట్టుకునేందుకు మత్తు ఇంజక్షన్ బృందం, బోన్లను సిద్ధం చేసి అటవీ శాఖ చర్యలు ప్రారంభించిందన్నారు. గ్రామ ప్రజలు ముఖ్యంగా రాత్రి వేళల్లో పొలాల వైపు ఒంటరిగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.
ఈ సందర్భంగా సింగనమల శాసన సభ్యురాలు బండారు శ్రావణి మరియు తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరస నాయుడు మాట్లాడుతూ ఈ ఘటనలో గాయపడిన వారి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, వారికి తక్షణ వైద్య సహాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని తెలిపారు. అటవీ శాఖ, పోలీస్ శాఖలతో సమన్వయం చేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని సంబంధిత ప్రాంతాల్లో అవసరమైన పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా బాధితులను పరామర్శించారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండాలని కోరారు.



## చట్టం సాహితీ లోకం 95814 19999

### ఆకలి



ఆకలి మంట కాదు కాలచక్రానికి సూచన
ఆకలి శ్రమకు సంకేతం శరీర జ్ఞాపకాల దృష్టి
ఆకలి నడకకు నిదర్శనం నియమాల పాఠం
ఆకలి జీవన ప్రవాహాన్ని కాపాడగలిగే స్వశక్తి

ఆకలి ఫలసిద్ధాంతంగా ఈ ప్రకృతి పలుకు
ఆకలి ఫలించాలని పలికేటి అంతర్గత ఆజ్ఞ
ఆకలి నిష్ఫల భావాలకు ప్రతికూల ఖండన
ఆకలి జీవించాల్సిన అవసరం తెల్పే ప్రకటన

ఆకలి భయం కాదు బంధాన్ని కట్టే తాపం
ఆకలి మమేకతను నేర్పే మౌన గుణపాఠం
ఆకలి మాయామోహాలను కరిగించే ఉష్ణం
ఆకలి సహజత వైపుకు మళ్లించే సంకేతం

ఆకలి తృప్తిని కాదు శ్రమసుఖానికి సంజ్ఞ
ఆకలి చీమబాట జీవన సూత్రంలోని ప్రజ్ఞ
ఆకలి పక్షి ప్రయాణంలో దాగివున్న సత్యం
ఆకలి సాధారణ నడకలలోని మహత్యం

ఆకలి గమ్యశోధన ముసుగును తొలగింపు
ఆకలి నిత్యానంద విలువలకు ఒక గుర్తింపు
ఆకలి సమిష్టి సంతోష ధ్యేయానికి జ్యోదకం
ఆకలి ఐక్యతను జాగృతం చేసే మూలకం.

బిటవరం శ్రీమన్నారాయణ ఎలుకుర్తి
హవేలి వరంగల్.

## చట్టం సాహితీ లోకం 95814 19999

### భోళాశంకరు నే పూజించెద



ఎప్పుడు గొప్పులోన జలమెప్పుడు జంద్రుడు, వామపార్శ్వమున్
గొప్పగు కేశపాశములు గుప్పిటనొప్పు గపాలమెప్పుడున్
జెప్ప నశక్యమైన ఫణిశేషులు శూలము వ్యాఘ్రచర్మమే
యొప్పెడు నుబ్బులింగడు మదూహల నొప్పదొ మల్లికార్జునా---11

తలలను ద్రెంచి హోమమున దండి తపంబున రావణాఖ్యుడున్
కలనిని గ్రీడికండ్లనిడి గర్వమణంచియు నీవు మెచ్చగా
దలపున శ్రీ ఫణీభములు ధాత్రి మహామహులెందరెందరో
యలవలె బొంగె నీ కరుణకందరు బాత్రులె మల్లికార్జునా---12

ఉల్లములుల్లసిల్ల పలునుక్తులు వల్కిన నెల్లవారలున్
జల్లని నీకృపామృతము జాలగ గ్రోలుదురాత్మలింగ నీ
కెల్లెడ భక్తులే ధరకు క్షేమమనోహర జంతుజాలమున్
మల్లిక పూలగొల్చెదను మాయల చెంచువు మల్లికార్జునా---13

తెలియను సేవసేయ నిను దెల్లని దేవుని గౌరివల్లభా
బలిమిని గన్నులీయగను, పాశముపైబడ మౌనిసూతినై
చలిత మనోరథుండనిను జారు మనోహర విశ్వనాథ నే
నలసుడ పుణ్యపాపముల నర్చన నేరను మల్లికార్జునా---14

తుదిమొన గానలేక కడు తొందర వోయిరి బ్రహ్మవిష్ణువుల్
మది మధుసూదనుండు బలుమారులు నీపద భక్తినిల్పు దా
నెదనిను దాల్చి దానవుడు నేగతి బొందెనొ పార్వతీశ్వరా
మదినిను దల్చు నాపయిన మత్సరమేలర మల్లికార్జునా---15

దక్షసుయజ్ఞనాశన విధాతశిరంబును గూల్చెభద్ర భ
ద్రక్షయ వేదసార విబుధాస్తుత నిర్మల దక్షజాపతీ
రక్ష విలక్షణా!సురమురారి వశిష్ఠ విశిష్ట వందితా
దక్షుడవయ్య మోక్షమిడ త్ర్యంబక దండము మల్లికార్జునా---16

పాపుల శిక్షజేతువట పాపమణంచుట నీకసాధ్యమా
చూపుల గామునార్పి మలిచూపుల జక్కని కాయమిచ్చి యా
పాపి కుబేరుడయ్యె బలుపన్నగముల్ కరకంకణంబులై
ప్రాపుగ నామృకండుజుని బాలన సేసిన మల్లికార్జునా---17

ఎంతదయాళువయ్య పరమేశ్వర శ్రీ ఫణిహస్తినేల నీ
కెంత యపారభూతదయ యెక్కడి కోర్కులు రాక్షసాళికిన్
సంతసమొంద నిచ్చితివి సాంబదిగంబర ధర్మమౌనొ కా
లాంతక సృష్టిధర్మమట కాలనురాయగ మల్లికార్జునా---18

పాలను ముంచినన్ జలధి పాలొనరించిన నీవెకాని పా
పాలను బాఅద్రోల పరభావన నీయగ కర్మవార్ధినిన్
గూళల కిచ్చివేయుటయు గూరిమి మోక్షము నీవొసంగ నిం
కేలను వేల్పులెల్లరను వేడగ దెల్పవె మల్లికార్జునా---19

రాముడు గృష్ణులాది నిను రావణదర్పవినాశ కేతరున్
దేముని దేవదేవుడని దెంపున బొక్కస మిత్తువంచునిన్
క్షేముని భక్తవత్సలుని జేరితి భారము నీదె బ్రోవగా
గామవినాశు గాంచిరట కార్యఫలార్థము మల్లికార్జునా---20

రచన:: శంకర్ జీ డబ్బికార్
ఊరు:: ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956
-----------

## చట్టం సాహితీ లోకం 95814 19999

### నా హృదయ రాగమా



నా హృదయ రాగమా
నా మదిలోన మెదిలిన జ్ఞాపకమా
నా జీవితమున నిలిచిన నేస్తమా
నా జీవిత సర్వస్వమా

నాతో ఏడడుగులు నడచితివి
నాతో మూడుముళ్ళు వేయించుకుంటివి
నా దేహంలో సగభాగంగా ఉంటివి
నాకు జీవిత మధురిమను చూయిస్తివి

నా అణువణువు నిండిఉన్న నా ప్రాణమా
నాతో జీవితాన్ని పంచుకుంటివి
నాలో సగభాగమై నిలిచి ఉంటివి
ఇపుడు అందని దూరాలకు చేరుకుంటివి

ఇపుడు నీ జ్ఞాపకాలతోనే నేను
కాలం గడుపుతూ ఉన్నాను చెలీ
నీపైన కవితలను వ్రాసుకుంటున్నాను
జన్మ జన్మలకు నీవే నాకు జీవితేశ్వరివి

భగవంతున్ని వేడుకుంటాను నేను
నిన్నే నాకు తోడుగా పంపించమని
ఎన్ని జన్మలకైనా నీవే నా పత్నిగా
ఉండాలని కోరుకుంటాను నా చెలీ

అక్కి నర్సింలు గౌడ్
విశ్రాంత ఉపాధ్యాయుడు
మల్లాపూర్ రంగారెడ్డి జిల్లా
కవి గాయకుడు

## చట్టం సాహితీ లోకం 95814 19999

### నా ఆరాటం



నా గుండె చప్పుడు
విని చూడు...
అది లబ్ డబ్ కాదు,
ఈ సమాజం కోసం తడబడే
ఒక మనసు స్పందన.

నా మనసు
ఏమి కోరుకుంటుందో తెలుసా?
నా ఎదుగుదల కాదు,
అందరూ సమానంగా
నవ్వగలిగే రోజు రావాలని.

నా కళ్ళు
ఏమి చూస్తున్నాయో తెలుసా ...
రంగులు, మతాలు, రూపాలు కాదు,
ఆకలితో ఉన్న కడుపునూ,
న్యాయం కోసం ఎదురు చూస్తున్న
మౌన ప్రశ్నలనూ.

ప్రేమ అనేది
వాళ్లను చూసి జాలి పడటం కాదు,
వాళ్లతో కలిసి నడవడం,
వాళ్ల కోసం నిలబడడం.

అప్పుడు మాత్రమే
మనిషి మనిషిగా నిలుస్తాడు,
ఈ దేశం నిజమైన కుటుంబమవుతుంది

మిత్రాజి
( గుండవరం ప్రభాకర్ రావు పంతులు )



## చట్టం సాహితీ లోకం 95814 19999

### ఎన్నికల మణిపూసలు



చెబుతావా నేస్తమా?
డబ్బులతో గెలుస్తమా?
ఎన్నికల యుద్ధములో
విజేతగా నిలుస్తమా?

లక్షలాయె కోట్లునాయె
ఎత్తుకు పై ఎత్తులాయె
ఎందుకు ఓడింద్రు మరి?
అర్థమవని చిక్కులాయె!

సేవను గమనిస్తరు
గతమును గమనిస్తరు
ఓటర్లు నాయకుల
మాటను గమనిస్తరు!

నే నిచ్చిన, నీ విచ్చిన
తాయిలాల నెవరిచ్చిన
తీసుకొని ఓటేస్తరు
వారి మనస్సుకు నచ్చిన!

"నాయకుడు"గ ఎదుగుటకు
ప్రజా సేవలు మరువకు
ఎప్పుడైన నొకసారి
పదవి వచ్చు నీ కడకు!

వడిచర్ల సత్యం
మణిపూసల సృష్టికర్త.

## చట్టం సాహితీ లోకం 95814 19999





### దేవలోక అప్సరస ఊర్వశి

శ్రీమన్నారాయణుని ఊరువు నుండి ఉద్భవించిన అద్భుత సౌందర్యరాశి ఊర్వశి.
దేవతల సభలో వెన్నెల కాంతులతో దివ్యంగా వెలుగొందే అప్సరస.
ఆమె చిరునవ్వు వేయి సూర్యుల ప్రభలకు సాటి.
ఆమె కురులు కారు మబ్బుల నీడను పోలి ఉంటాయి.

నుదుటి తిలకం ఉదయించే బాల సూర్యుని తేజస్సుతో సమం.
ఆమె పాద గజ్జెల సవ్వడికి శిలలు సైతం ప్రాణంపోసికొని ఆలపిస్తాయి మధురగీతాలని.
అప్సరసల్లో అగ్రగణ్యురాలిగా నిలిచిన సుందర లావణ్యం.
పురూరవుని మనసుని గెలిచికొనిన ప్రేమ సామ్రాజ్యపు రాణి.

విశ్వామిత్రుని తపస్సుని సైతం కరిగించగలిగే సమ్మోహినిరాలు.
స్వర్గానికే శోభను తెచ్చిన అపూర్వ లావణ్య రాశి.
రంభ, తిలోత్తములను మించిన రూప లావణ్య రాశి.
ముల్లోకులను మరిపించి, మోహింప చేసే ముగ్ధ మనోహర శిల్పం.

దేవ లోకంలో మేటి అప్సరస ఊర్వశి.
ఆమె నాట్య విన్యాసానికి సమస్త లోకాలు దాసోహం.
అర్జునునికి నపుంసకత్వం పొందమని శాపమొసంగిన అప్సరస.
భూలోకంలో కూడా అందగత్తెలని ఊర్వశి పేరుతో పిలుస్తారు.
నవరసాలు అలవోకగా పలికించగల నర్తకి, భువనైక మోహిని.
కాళిదాసు కలమందు నిలిచిన కవితా సుందరి.



తెలికిచెర్ల రాజ కృష్ణ కామేశ్వర రావు
రిటైర్డ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్,
భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ,
ఇస్రో,
షార్,
శ్రీహరికోట
సూళ్లూరుపేట / తిరుపతి జిల్లా

## చట్టం సాహితీ లోకం 95814 19999

### అక్షర సేద్యం..!



ఓ కవి శేఖరా..!
సామాజిక అంశాలే
మానవీయ సంబంధాలే
ఇతివృత్తంగా మీ కవిత్వం
అలతి పదాల అమరికలతో
అందమైన భావాల మెరుపులతో
తేట తెలుగు తేనెల సోనలతో

ఉపమానాలే ఊపిరిగా
ఉత్ప్రేక్షలే ఆభరణాలుగా
ప్రతీకలే కవితకు ప్రాణంగా
ప్రతి గుండెను తట్టి లేపాలి..

అజంతా శిల్పపు సొగసును
నవరస భరితమైన విందును
అక్షరాల రూపంలో వడ్డించాలి
పాఠకలోకాన్ని పరవశింపజేయాలి...

ఓ కవి శేఖరా..!
నీ అక్షరం ఒక మంత్రమై...
నీ కవిత్వం ఒక తంత్రమై...
నీ సాహిత్యం..ఒక నిత్య వసంతమై...

చదివే ప్రతి కన్ను చెమ్మగిల్లాలి
వినే ప్రతి చెవికి విందు కావాలి
గుండెల్ని కదిలించాలి కరిగించాలి
అందరినీ ఆకట్టుకోవాలి అలరించాలి

ప్రతి పాఠకుడు పులకించి పోవాలి
దీర్ఘాయుష్మాన్ భవా అంటూ
మనసులోనే నిన్ను దీవించాలి...

అందుకే
కట్టె కాలే లోపు
కమ్మని భావాల్ని పంచు...
కొట్టే గుండె చప్పుడల్లే
కవితా గీతం వినిపించు...
తెచ్చే కీర్తి కాంతులతో
సాహితీ వనాన్ని పండించు...


రచన: కవిరత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కవి కూకట్లపల్లి



### ప్రేమ నిశీధి

కార్తీక పౌర్ణమి వెన్నెలలో
అరుణాచలేశ్వరుని గిరిప్రదక్షిణలో
మనమిరువురం ముప్పై ఏండ్ల క్రిందట
ఒకరినొకరు కళ్ళతో చూసినది
కుటుంబ పరిచయకార్యక్రమాలు అయి
వారి అంగీకారంతో ఒకరికొకరు
అర్ధనారీశ్వరతత్వానికి ప్రతీకగా
ప్రేమానురాగాలతో మమేకమై
మనసున మనసై బ్రతుకున బ్రతుకై జీవిస్తు
పవిత్ర ప్రేమకు చిహ్నంగా
నేను వృత్తి రీత్యా రెండు రోజులు ఉరికెళ్ళిన
నా కొరకై ప్రేమ తో అర్ధరాత్రి వరకు ఎదురుచూసి
నే వచ్చిన వేళ సంబరంగా హృదయానికి
హత్తుకున్నది మధుర జ్ఞాపకమే
అర్ధాంతరంగా నను వదలి వెళ్ళినా
నీ జ్ఞాపకాలతో నిశీధిలో నాకొరకై
ఆనాడు నీవు ఎదురుచూసినట్లే
నేడు నీదరి చేరాలని
భగవంతుని వినమ్రతతో అంజలి ఘటిస్తు
ప్రార్థిస్తున్నా..!!
...............................

ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్.
హైదారాబాద్






## జర భద్రం...!



ఓ మిత్రమా
రోడ్డుపై వెళ్ళేటలో
బండి నడుపుటలో
జాగ్రత
జర జాగ్రత హెల్మెట్ ధరించు.

ఓ మిత్రమా
మాటల యుద్ధంలో
వాగ్దాటి ప్రవాహంలో
జాగ్రత
జర జాగ్రత ఓపిక వహించు.

ఓ మిత్రమా
సలహా పొందుటలో
నిర్ణయం చేయుటలో
జాగ్రత్త
జర జాగ్రత్త శ్రద్ధ చూపించు.

ఓ మిత్రమా
ప్రేమ చూపుటలో
ఆత్మీయత సాగుటలో
జాగ్రత్త
జర జాగ్రత అత్యుత్సాహం తగ్గించు.

డా. యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం.




# జైలర్-2లో షారుఖ్

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ క్రేజీ సీక్వెల్ జైలర్ 2. తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. సీక్వెల్‌లో శివరాజ్‌కుమార్, మోహన్ లాల్ పాత్రలు రిపీట్ కానున్నాయని ఇప్పటికే వార్తలు వచ్చాయి. మరోవైపు తాజాగా బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడని అప్‌డేట్ కూడా వచ్చింది. కాగా దీనిపై అఫీషియల్ న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. జైలర్ 2 నెక్ట్స్ షెడ్యూల్ ముంబైలో జరుగనుంది. తాజా సమాచారం ప్రకారం వచ్చే వారం షురూ కానున్న ఈ షెడ్యూల్‌లో షారుక్ ఖాన్ జాయిన్ అవ్వబోతున్నాడు. ఈ షెడ్యూల్‌లో షారుక్‌ఖాన్‌పై వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి నెల్సన్ దిలీప్ కుమార్ షారుక్ ఖాన్‌ను ఎలాంటి స్పెషల్ రోల్‌లో చూపించబోతున్నాడు.. తలైవా,



షారుక్ ఖాన్ కాంబోలో సీన్లుంటాయా..? అన్నది తెలియాల్సి ఉంది. సిల్వర్ స్క్రీన్‌పై ఇద్దరు స్టార్ యాక్టర్లను చూసేందుకు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్, అభిమానులు. జైలర్ 2ను 2026 జూన్ 12న




ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇప్పటికే రజినీకాంత్ క్లారిటీ కూడా ఇచ్చాడని తెలిసిందే. సీక్వెల్‌లో బాలీవుడ్ భామ విద్యాబాలన్‌తోపాటు కోలీవుడ యాక్టర్ సంతానం కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలుస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ స్టార్ యాక్టర్లపై అఫీషియల్ అప్‌డేట్ ఏమైనా ఇస్తారేమో

# అతడి ప్రవర్తన చూసి దూరం పెట్టాను

### మాజీ ప్రియుడి గురించి మృణాల్ కామెంట్స్




కొన్ని రోజులుగా ప్రేమ, పెళ్లి అంశాల్లో వరుసగా వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్. తాజాగా ఆమె తన మాజీ ప్రేమికుడి గురించి చెప్పి మరోసారి నెట్టింట వైరల్‌గా మారారు. అతడితో బంధం ముగిసి పోయినందుకు తానేమీ బాధ పడలేదని తెలిపారు. ఆమె నటించిన తాజా చిత్రం 'దో దీవానే శహర్ మే' ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మాజీ ప్రేమికుడి గురించి ప్రస్తావించారు. నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండలేనని బ్రేకప్ చెప్పాడు. నేను యాక్టింగ్ చేయడం కూడా తనకు నచ్చలేదు. విడిపోవడానికి అది కూడా ఓ కారణం. బ్రేకప్ చెప్పినందుకు నేనేం బాధపడలేదు. తన మనస్తత్వం గురించి జాలి పడ్డాను. అలాంటి వాళ్లతో కొనసాగడం కూడా కష్టమే. అందుకే విడిపోయాం. అలాంటివాళ్లతో ఉంటే భవిష్యత్తులో పిల్లలు కూడా అదే భావనలతో పెరుగుతారు. అది నాకు ఇష్టం లేదని మృణాల్ తెలిపారు.కొన్ని నెలలుగా మృణాల్ డేటింగ్ వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. నటుడు ధనుష్ తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ధనుష్ తనకు మంచి స్నేహితుడంటూ ఆ ప్రచారాన్ని మృణాల్ ఖండించారు. తర్వాత టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ తో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వీటిపై స్పందిస్తూ.. 'ఇలాంటి రూమర్స్ వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉంటాయి. వాళ్లు వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నేను నవ్వుకుంటాను. ఫ్రీ పీఆర్ స్టంట్స్ ఇవి' అంటూ వాటికి చెక్ పెట్టారు.

# పౌరాణిక పాత్రల్లో ఒదిగిపోవాలి


### పాత్రల్లో పరకాయ ప్రవేశం చేయాల్సిందే

### రామాయణ మూవీపై అరుణ్ గోవిల్

బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ' సినిమాలోని పాత్రల గురించి నటుడు అరుణ్ గోవిల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇలాంటి చిత్రాల్లో నటీనటుల లుక్స్‌పై ప్రేక్షకులు ఎక్కువగా ఫోకస్ చేస్తారని తెలిపారు. వారిని జీవితమంతా అదే పాత్రలో గుర్తుంచుకుంటారని అన్నారు. రామానంద్ సాగర్ తెరకెక్కించిన 'రామాయణ్'లో అరుణ్ రాముడిగా కనిపించారు. అప్పటినుంచి రాముడి పాత్ర అనగానే ఆయనే గుర్తుండిపోయేలా అందులో కనిపించి ఆకట్టుకున్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రానున్న 'రామాయణ'లో అరుణ్ గోవిల్ దశరథుడి పాత్రలో కనిపించనున్నారు. దీని గురించి మాట్లాడుతూ.. 'ఏదైనా సినిమా వస్తుందంటే దానిని పోల్చడానికి ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. మనం దేవుడి పాత్ర పోషించేటప్పుడు చూడగానే అలానే కనిపించాలని. లుక్స్ చాలా ముఖ్యం. ఆడియన్స్ తెరపై మనల్ని చూడరు.. మన పాత్రలో ఉన్న దేవుడిని చూస్తారు. బహుశా దేవుడు నిజంగా ఇలానే ఉండటాడేమో అనుకోవాలి. అంతలా మనం ప్రభావితం చేయాలని చెప్పారు. ఇక ఈ



చిత్రాన్ని 'ఆదిపురుష్'తో పోల్చవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి చిత్రం దేనికదే ప్రత్యేకమన్నారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా రానున్న ఈ సినిమాలో సీతగా సాయిపల్లవి కనిపించనున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ చిత్రాన్ని సుమారు రూ.4,000 కోట్లతో రూపొందించనున్నారు. ప్రపంచమంతా ఈ ఇతిహాసాన్ని చూడాలన్న లక్ష్యంతోనే దీన్ని భారీస్థాయిలో రూపొందిస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఇందులో రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ ఈ ఏడాది దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి.





# మూవీగా వస్తోన్న మిర్జాపూర్ వెబ్ సీరిస్




యాక్షన్ క్రైం థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచిన ఫ్రాంచైజీ సిరీస్ మిర్జాపూర్. ఈ సిరీస్‌లో ఇప్పటికే మూడు సీజన్లు సందడి చేశాయి. పవర్ ఫుల్ క్యారెక్టర్లతో సాగే మూడు సీజన్లకు ప్రేక్షకుల వద్ద నుంచి అదిరిపోయే స్పందన వచ్చింది. కాగా ఈ యూనివర్స్‌ను మరింత ఎక్కువ మంది ప్రేక్షకులకు అందించేందుకు మేకర్స్ సరికొత్త ప్లాన్‌తో వస్తున్నారు. మిర్జాపూర్ ఇక ఫీచర్ ఫిల్మ్‌గా రానుంది. ఈ సినిమా కథను థియేటర్లలో అద్భుతమైన థియాట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా డిజైన్ చేశారని ఇన్‌సైడ్ టాక్. మిర్జాపూర్ ది ఫిల్మ్ అధికారికంగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉందని తెలియజేశారు. క్రైం సాగాను బిగ్ స్క్రీన్‌పై ఎలా చూపించబోతున్నారని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. ఈ చిత్రంలో పాపులర్ యాక్టర్లు పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గుర్మీత్ సింగ్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రానికి పునీత్ కృష్ణ కథనందిస్తున్నారు. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రితేశ్ సిధ్వానీ, ఫర్హాన్ అక్తర్ నిర్మిస్తున్నారు. విడుదలకు సంబంధించిన వివరాలపై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. గుర్మీత్‌సింగ్, ఆనంద్ అయ్యర్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన మిర్జాపూర్ వెబ్ సిరీస్‌లో పంకజ్ త్రిపాఠి, శ్వేతా త్రిపాఠి, అలీ ఫజల్, హర్షిత గౌర్, విజయవర్మ తదితరులు నటించారు.

# ఓటిటిలో ట్రెండ్ అవుతున్న శంబాలా

ఆది సాయికుమార్ నటించిన మిస్టిల్ థ్రిల్లర్ మూవీ 'శంబాల'. గతేడాది చివర్లో విడుదలైన ఈ సినిమా జనవరి 22న ఆహా వేదికగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. తాజాగా ఈ చిత్రం ఓటీటీలో రికార్డు సృష్టించింది. 10 రోజుల్లో 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ దాటి అత్యధికంగా వీక్షించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. ప్రేక్షకులకు చిత్రబృందం కృతజ్ఞతలు తెలిపింది. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అర్చన అయ్యర్ హీరోయిన్. కథేంటంటే..: 1980వ దశకం నేపథ్యంలో సాగే కథ ఇది. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ఓ ఊరు శంబాల. అక్కడ ఆకాశం నుంచి ఓ ఉల్క పడుతుంది. అప్పటినుంచి ఊరిలో అనూహ్యమైన సంఘటనలు జరగడం మొదలవుతాయి. ఉన్నట్టుండి ఎవరో ఒకరు విచిత్రంగా ప్రవర్తిస్తూ హత్యలు చేస్తారు, ఆత్మహత్యలకు పాల్పడతారు. దాంతో బండ భూతం ఆవహించిందంటూ ఊరి జనం భయంతో వణికిపోతుంటారు. మూఢ నమ్మకాలు రాజ్యమేలుతాయి. ఆ రహస్యాలను ఛేదించేందుకు ప్రభుత్వం విక్రమ్ (ఆది సాయి కుమార్) అనే యువ శాస్త్రవేత్తని ఆ గ్రామానికి పంపిస్తుంది. సైన్స్‌నే నమ్ముకుని విధులు నిర్వర్తించే విక్రమ్ ఆ ఊళ్లో జరుగుతున్న సంఘటనల వెనక రహస్యాల్ని ఛేదించాడా? ఆ ఊరిలో కనిపించిన దేవి (అర్చన అయ్యర్) ఎవరు? విక్రమ్ నమ్ముకున్న సైన్స్‌కీ, ఊరి చరిత్ర వెనకున్న శాస్త్రానికి మధ్య సంఘర్షణ ఎలా సాగిందన్నది మిగతా కథ.








# మ్యాచ్ బాయ్‌కాట్ చేస్తే పాక్‌కు చుక్కలే

తమ జట్టు 2026 టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొంటుందని, అయితే ఫిబ్రవరి 15న శ్రీలంకలో భారత్‌తో జరిగే మ్యాచ్ కోసం మైదానంలోకి దిగదని పాకిస్తాన్ ప్రభుత్వం గత ఫిబ్రవరి 01న అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటన తర్వాత క్రికెట్ ప్రపంచంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాస్తవానికి పాకిస్తాన్ తెలివి తక్కువగా ఇంత పెద్ద ప్రకటన చేసింది, కానీ దీనివల్ల కలిగే నష్టాన్ని వారు ఊహించలేదు అని మాజీ క్రికెటర్లు అంటున్నారు. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల పాకిస్తాన్‌కు 5 పెద్ద నష్టాలు ఉన్నాయి. దైనిక్ జాగరణ్ ప్రకారం, పాకిస్తాన్ ఈ నిర్ణయం ప్రకటించడం అంటే భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించినందుకు ప్రపంచ కప్ నుండి ఆ జట్టుపై నిషేధం పడవచ్చు. టోర్నమెంట్ నుండి బంగ్లాదేశ్ ఇప్పటికే తన పిచ్చి నిర్ణయం కారణంగా నిష్క్రమించింది. ఇప్పుడు పాకిస్తాన్ ప్రపంచ కప్ నుండి నిషేధం ఎదుర్కొనే ప్రమాదంలో పడింది. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించినందుకు పాకిస్తాన్ ఆదాయంపై కూడా ఐసిసి నిషేధం విధించవచ్చు. నివేదికల ప్రకారం, ఐసిసి ద్వారా పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు సంవత్సరానికి 34.51 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు 316 కోట్ల రూపాయలు) ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం నిలిచిపోతే పాకిస్తాన్ పూర్తిగా దివాలా తీసినట్లే. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే, పాకిస్తాన్ జట్టు జియోస్టార్‌కు నష్టపరిహారం చెల్లించాల్సి రావచ్చు. ప్రపంచ కప్‌లో భారత్-పాకిస్తాన్ మ్యాచ్ ద్వారా అత్యధికంగా సంపాదన వస్తుంది. ఈ మ్యాచ్‌లో 10 సెకన్ల ప్రకటన స్లాట్ సైతం చాలా ఖరీదైనది. మ్యాచ్ జరగకపోతే వారికి చాలా నష్టం వాటిల్లుతుంది. పాకిస్తాన్ మీద ద్వైపాక్షిక సిరీస్‌లపై కూడా పూర్తి నిషేధం విధించవచ్చు. ఈ నిషేధంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు మరింత దివాళా తీస్తుంది. ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల పాకిస్తాన్ పాకిస్తాన్ సూపర్ లీగ్ లో సైతం నష్టపోవచ్చు. వాస్తవానికి, టోర్నమెంట్ కోసం విదేశీ ఆటగాళ్ల ఎన్‌ఓసి అంటే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌పై నిషేధం విధించవచ్చు. భారత్ తో మ్యాచ్ లు ఆడకూడదనే నిర్ణయం గురించి పిసిబి ఇంకా ఐసిసికి తెలియజేయలేదని పలు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ బహిష్కరణను పిసిబి అధికారికంగా ఐసిసికి తెలియజేసిన తర్వాతే చర్యలు చేపడుతుంది.. 2026 టి 20 ప్రపంచ కప్ నుండి పాకిస్తాన్ ను మినహాయించవచ్చు అని ప్రచారం జరుగుతోంది. పాకిస్తాన్ టి 20 లీగ్ (పిఎస్-ఎల్) లో విదేశీ ఆటగాళ్లకు ఎన్‌ఓసిలు ఇవ్వడానికి కూడా ఐసిసి నిరాకరించవచ్చు. బంగ్లాదేశ్ ను వెనకుండి ప్రోత్సహించిన కారణంగా, వారికి ఓ న్యాయం, తమకు ఓ న్యాయం ఉండదని చెప్పడానికి.. బంగ్లా దారిలో పయనించి పాకిస్తాన్ ఈ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఐసిసి షెడ్యూల్ ప్రకటించిన తర్వాత తమ మ్యాచ్ లను భారత్ వెలుపల తరలించడానికి నిరాకరించిన తరువాత టి 20 ప్రపంచ కప్ లో పాల్గొనకూడదని బంగ్లాదేశ్ తన నిర్ణయాన్ని ప్రకటించింది. దీని తరువాత, పాకిస్తాన్ ఆటగాళ్ళు, పీసీబీ చీఫ్ మోహ్సిన్ నఖ్వీ ఐసిసిని విమర్శించారు. టోర్నమెంట్ ను బహిష్కరిస్తాం అన్నారు. అయితే, సెమీఫైనల్ లేదా ఫైనల్‌లో భారత్‌తో మ్యాచ్ ఉంటే ఏం చేయనున్నారో పాకిస్తాన్ ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. అప్పుడు వారు ఆడతారా లేదా? ప్రస్తుతం పాక్ ప్రభుత్వం ఫిబ్రవరి 15న జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరిస్తామని మాత్రమే ప్రకటించి అగ్నికి ఆజ్యం పోసినట్లు అయింది.

# నన్ను ఓ ఉగ్రవాదిలా చూశారు..

## టీమిండియా మాజీ పేసర్ శ్రీశాంత్



టీమిండియా మాజీ పేసర్, వరల్డ్ కప్ విన్నర్ శ్రీశాంత్ తన జీవితంలో ఎదుర్కొన్న అత్యంత కఠినమైన కాలాన్ని గుర్తు చేసుకున్నాడు. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ ఉదంతంతో తనను ఓ ఉగ్రవాదిలా చూశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 2013 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన శ్రీశాంత్.. స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలతో అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. జట్టులోని అజిత్ చండిలా, అంకిత్ చవాన్‌లతో కలిసి శ్రీశాంత్ స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బీసీసీఐ కూడా అతనిపై నిషేధం విధించింది. దాంతో శ్రీశాంత్ కెరీర్ అర్థాంతరంగా ముగిసిపోయింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత కోర్టు శ్రీశాంత్‌ను నిర్దోషిగా ప్రకటించింది. కోర్టు క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ, బీసీసీఐ అతనిపై విధించిన జీవితకాల నిషేధాన్ని ఏడేళ్లకు తగ్గించింది. నిషేధం ముగిసిన తర్వాత శ్రీశాంత్ దేశవాళీ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చినా మునపటిలా సత్తా చాటలేకపోయాడు. దాంతో క్రికెట్‌కు వీడ్కోలు పలికి కామెంటేటర్‌గా, విశ్లేషకుడిగా, సినీ నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నాడు. తాజాగా తన సతీమణి భువనేశ్వరి కుమారితో కలిసి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీశాంత్... స్పాట్ ఫిక్సింగ్ ఉదంతాన్ని గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురయ్యాడు. 'నా జీవితంలోనే స్పాట్ ఫిక్సింగ్ ఉదంతాన్ని మరిచిపోలేను. నా వివాహ ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే అరెస్ట్ కావడం అతిపెద్ద విషాదం. 2012లో నాకు ఆరు సర్జరీలు జరిగాయి, నేను వీల్ చైర్‌కే పరిమితమయ్యాను. అదే సమయంలో నాపై ఉగ్రవాది అనే ముద్ర వేశారు. నా మామగారి దగ్గరకు వెళ్లి.. 'నేను మళ్ళీ క్రికెట్ ఆడలేకపోవచ్చు, పైగా నాపై ఇలాంటి ఆరోపణలు ఉన్నాయి' అని చెప్పాను.'అని శ్రీశాంత్ గుర్తు చేసుకున్నాడు. శ్రీశాంత్‌పై వచ్చిన ఆరోపణలను తాను నమ్మలేదని అతని సతీమణి భువనేశ్వరి వివరించింది.'శ్రీశాంత్ అరెస్ట్ వార్త ఒక షాక్ లాంటిది. నా స్నేహితులు ఫోన్ చేసి టీవీ చూడమని చెప్పే వరకు నాకు ఈ విషయం తెలియదు. టీవీలో 'శ్రీశాంత్ అరెస్ట్' అనే వార్త చూసి నేను షాక్‌కు గురయ్యాను. వెంటనే మా నాన్న దగ్గరకు వెళ్లి ముందు నాకు ఒక మాట ఇవ్వండి.. నా పెళ్లి ఆపకూడదని కోరాను. స్వయంగా ఆ దేవుడే వచ్చి శ్రీశాంత్ తప్పు చేశాడని చెప్పినా నేను నమ్మను.'అని తన తండ్రితో గట్టిగా చెప్పినట్లు భువనేశ్వరి గుర్తు చేసుకున్నారు.

# నా మాటలు వక్రీకరించారు: మేరీకోమ్



భారత ప్రముఖ బాక్సర్ మేరీకోమ్? మరోసారి తన వైవాహిక బంధం గురించి మాట్లాడింది. ఇటీవల మాజీ భర్త కరుంగ్ ఆంఖోలర్‌పై ఆరోపణలు చేసే క్రమంలో ఆమె మాట్లాడిన మాటలను కొందరు వక్రీకరిస్తున్నారని చెప్పింది. ఆ వ్యాఖ్యలు పూర్తిగా తన తన మాజీ భర్తను ఉద్దేశించి మాత్రమే చేశానని, ఇంకెవరినీ బాధపెట్టాలని చేసింది కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో షేర్ చేసింది. 'చాలా ఏళ్ల పాటు మా వైవాహిక బంధం సజావుగానే సాగింది. అయితే నా భర్త తనను ఆర్థికంగా మోసగించడం వల్ల మా రిలేషన్ దెబ్బతింది. ఆ తర్వాతే మా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. గతేడాది మాకు విడాకులు మంజూరైన తర్వాత నాపై సోషల్ మీడియాలో వ్యతిరేకంగా దాడి జరిగింది. అయినా నేను సంయమనం పాటించాను' 'రీసెంట్?గా ఒక టాక్‌షోలో నేను మాట్లాడిన మాటల వల్ల ఎవరైనా ఇబ్బందిపడి ఉంటే క్షమించండి. ముఖ్యంగా పురుష సమాజం. ఆ మాటలన్నీ, నా వ్యక్తిగత జీవితంలో నేను అనుభవించిన బాధ నుంచి వచ్చినవే. అయితే నా మాటలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారు. కానీ నేను ఏ ఆటకు కూడా వ్యతిరేకం కాదు. నేను క్రీడాకారులందర్నీ గౌరవిస్తా' అని మేరీకోమ్ క్లారిటీ ఇచ్చింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మేరీకోమ్ తన మాజీ భర్తపై ఆరోపణలు చేసింది. అతడు 'గల్లీ ఫుట్?బాల్' (+ఖుశ్రీఱ ఖీశీశ్రీఱఝుశ్రీశ్రీ) ఆటగాడంటూ విమర్శించింది. 'అనేక మందిలాగే అతడు కూడా ఓ సాధారణ గల్లీ ఫుట్?బాల్ ప్లేయర్. అంతమాత్రాన అతను బైచుంగ్ భూటియా, సునీల్ ఛెత్రి అవ్వలేడు. కెరీర్?లో అసలు సక్సెస్ అవ్వలేదు' అని మేరీకోమ్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసింది. అయితే ఇందులో 'గల్లీ ఫుట్?బాల్' అనే వ్యాఖ్యల వల్ల కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయి. దీంతో ఇది కాంట్రవర్సీ అయ్యింది. ఈ వ్యాఖ్యలపై మేరీకోమ్ తాజాగా క్లారిటీ ఇస్తూ, క్షమాపణలు కోరింది. అయితే ఆమె మాజీ భర్త కరుంగ్ ఆంఖోలర్ ఓ ఫుట్‌బాల్ ఆటగాడు. అయితే మేరీకోమ్ కోసం తన కెరీర్‌ను సైతం వదులుకున్నానని కరుంగ్ గతంలో ఓ సందర్భంలో చెప్పారు. దీనిపైనే మేరీకోమ్ విరుచుకుపడింది. అలా మాట్లాడింది. అయితే తామిద్దరు దిల్లీలో కలుసుకున్నప్పటికే కరుంగ్ తన కెరీర్‌ను వదిలేశారని మేరీకోమ్ పేర్కొంది. 2005లో మేరీకోమ్- కరుంగ్ ఆంఖోలర్ వివాహం జరిగింది. మణిపుర్?కు చెందిన మేరీకోమ్ ప్రపంచ బాక్సింగ్?లో అనేక ఘనతలు సాధించింది. అంతర్జాతీయ వేదికల్లో భారత్?కు ప్రాతినిధ్యం వహించిన మేరీకోమ్ ఎన్నో మరపురాని విజయాలు సాధించింది. 2012లో ఒలింపిక్స్ కాంస్య పతక విజేతగా నిలిచింది. మహిళా బాక్సర్లలో ఇంకెవరికీ సాధ్యం కాని రీతిలో ఏకంగా ఆరుసార్లు వరల్డ్? ఛాంపియన్‌గా నిలిచింది. 2016 నుంచి 2022 మధ్య రాజ్యసభకు కూడా మేరీకోమ్ ప్రాతినిధ్యం వహించింది. అయితే 41ఏళ్ల మేరీకోమ్ ప్రస్తుతం బిగ్ ఈవెంట్?లలో ఆడకున్నా, రిటైర్మెంట్ తీసుకున్నట్లు మాత్రం ఎక్కడా ప్రకటించలేదు. దేశం తరపున ఇంకా పతకాలు సాధించాలనే ఆకలి ఉన్నట్లు గతంలో ఓ సందర్భంలో పేర్కొంది.

# అభిషేక్ శర్మ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా నిలుస్తారు

## ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ జోస్యం



2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా నిలుస్తారని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ జోస్యం చెప్పారు. ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలవడమే కాకుండా, 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును కూడా గెలుచుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఐసీసీ ఈవెంట్లలో పెద్దగా అనుభవం లేకపోవడం అభిషేక్‌కు ఒక రకంగా కలిసొస్తుందని పాంటింగ్ విశ్లేషించారు. 25 ఏళ్ల అభిషేక్ శర్మ ఫిబ్రవరి 7న ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీ ద్వారా తన టీ20 ప్రపంచకప్ అరంగేట్రం చేయబోతున్నాడు. "అతడొక స్టార్," అని ఐసీసీ రివ్యూ తాజా ఎడిషన్‌లో పాంటింగ్ పేర్కొన్నారు. "నిజం చెప్పాలంటే, అనుభవం లేకపోవడం అనేది అతనికి సానుకూల అంశం. అతను అత్యధిక పరుగులు చేయడమే కాకుండా, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అయ్యే అవకాశం కూడా ఉంది" అంటూ పాంటింగ్ చెప్పుకొచ్చాడు. "అతను అంతటి ప్రతిభావంతుడని నేను నమ్ముతున్నాను. ఒకవేళ అతను రాణిస్తే భారత్‌ను ఓడించడం ఎవరికైనా కష్టమవుతుంది. అతను విఫలమైతే, భారత్ కూడా మిగతా జట్లలాగే ఒత్తిడికి లోనవుతుంది. అందుకే ఈ ప్రపంచకప్‌లో భారత్ తరపున అతను చాలా కీలకమైన ఆటగాడని నేను అనుకుంటున్నాను" అంటూ పొగడ్తల వర్షం కురిపించాడు. ఐపీఎల్ ప్రారంభ రోజుల్లో అభిషేక్ శర్మతో కలిసి పనిచేసిన అనుభవంతో, గ్లోబల్ స్టేజ్‌పై అతను ఒత్తిడికి గురికాడని పాంటింగ్ ధీమా వ్యక్తం చేశారు. "నేనే అతని మొదటి ఐపీఎల్ కోచ్‌ని," అని ఢిల్లీ క్యాపిటల్స్‌లో తన అనుభవాన్ని పాంటింగ్ గుర్తు చేసుకున్నారు. "నా హయాంలోనే అతను 17 ఏళ్ల వయసులో ఢిల్లీ తరపున అరంగేట్రం చేశాడు. మొదటి బంతినే బౌలర్ తల పైనుంచి క్లాసికల్ షాట్‌తో ఫోర్ లేదా సిక్స్ కొట్టి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. అప్పుడే అతనిలో ఏదో తెలియని అద్భుతమైన ప్రతిభ ఉందని నాకు అర్థమైంది" అంటూ చెప్పుకొచ్చాడు. అభిషేక్ శర్మను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు నుంచి ట్రేడ్ చేయడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించానని కూడా పాంటింగ్ వెల్లడించారు. "అతన్ని వదులుకోవద్దని నేను మేనేజ్‌మెంట్‌ను బతిమిలాడాను. ఒక అద్భుతమైన సూపర్‌స్టార్ తయారవుతున్నాడని చెప్పాను. ఇప్పుడు అది నిజమైంది" అంటూ తెలిపాడు. 2018 అండర్-19 ప్రపంచకప్ విజేత జట్టులో సభ్యుడైన అభిషేక్, ఇప్పుడు తన మొదటి సీనియర్ టీ20 ప్రపంచకప్ ఆడబోతున్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన 4 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 152 పరుగులతో దుమ్మురేపాడు. మూడో మ్యాచ్‌లో కేవలం 14 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ఇది టీ20ల్లో భారత్ తరపున రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ. 2007లో ఇంగ్లాండ్‌పై 12 బంతుల్లోనే అర్ధ సెంచరీ చేసిన యువరాజ్ సింగ్ మాత్రమే అభిషేక్ కంటే ముందున్నాడు. వరుసగా రెండుసార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించాలనే భారత ప్రయత్నంలో అభిషేక్ కీలక పాత్ర పోషించనున్నాడు. గ్రూప్-ఏ లో ఉన్న భారత్, ఫిబ్రవరి 7న అమెరికాతో తన తొలి మ్యాచ్ ఆడనుంది.

# ఐసీసీ ఆంక్షలకు భయపడం..

## భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నాం భవిష్యత్తులోనూ భారత్‌తో ఆడం

## పాక్ ట్టు మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇది ఈ ఒక్క మ్యాచ్‌తోనే ఆగిపోదని, భవిష్యత్తులో కూడా భారత్‌తో జరిగే మ్యాచ్‌లను పాకిస్థాన్ బహిష్కరిస్తుందని ఆ జట్టు మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్ అన్నాడు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ఆదివారం తెరలేవనుంది. గ్రూప్-ఏలో భాగంగా ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచ్‌ను బాయ్‌కట్ చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన రషీద్ లతీఫ్.. ఐసీసీ ఎన్ని ఆంక్షలు విధించినా పీసీబీ భయపడబోదని స్పష్టం చేశాడు. 'భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ల నుంచి ఐసీసీ, ఆసియా క్రికెట్ కౌన్సిల్ భారీ లాభాలను ఆర్జిస్తున్నాయి. రాబోయే మూడేళ్లలో ఉమ్మడి వేదికగా మ్యాచ్‌లు ఆడేందుకు ఇరు దేశాల క్రికెట్ బోర్డులు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అంతా సవ్యంగా సాగుతున్న క్రమంలో బంగ్లాదేశ్ జట్టు టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకుంది. దాంతో పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి.

# టీ20ల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు

## చరిత్ర సృష్టించిన బాబర్ ఆజామ్..

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ముందు పాకిస్థాన్ అదిరిపోయే విజయాన్ని అందుకుంది. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన ఆఖరి టీ20లో సమష్టిగా చెలరేగిన పాకిస్థాన్ 111 పరుగుల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. 208 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ 96 పరుగులకే ఆలౌటైంది. మహమ్మద్ నవాజ్(5/18) ఐదు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. షాహీన్ షా అఫ్రిది(2/16) రెండు వికెట్లు తీసాడు. అబ్రర్ అహ్మద్, నసీమ్ షా తలో వికెట్ తీసారు. ఆసీస్ బ్యాటర్లలో కామెరూన్ గ్రీన్(22), మార్కస్ స్టోయినీస్(23), జోష్ ఫిలిప్పే(14) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అంతకుముందు పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 207 పరుగుల భారీ స్కోర్ చేసింది. సైమ్ ఆయుబ్(37 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 56), బాబర్ ఆజామ్(36 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 50 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించగా.. షాదాబ్ ఖాన్(19 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 46) దూకుడుగా ఆడారు. ఇక ఈ మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేయడం ద్వారా బాబర్ ఆజామ్ వరల్డ్ రికార్డ్ నమోదు చేశాడు. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు బాదిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అతను టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రికార్డును అధిగమించాడు. బాబర్ ఆజామ్ ఇప్పటి వరకు 39 అర్ధ శతకాలు సాధించగా.. విరాట్ కోహ్లీ 38 హాఫ్ సెంచరీలతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999